


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 145, పేజీలు - 08

శుక్రవారం, సెప్టెంబర్ 27, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## పరమ్ రుద్ర సూపర్ కంప్యూటార్లు ప్రారంభం

- మూడు సూపర్ కంప్యూటర్ల విలువ సుమారు రూ.130 కోట్లు
- శాస్త్రీయ పరిశోధనలను సులభతరం చేయనున్న అత్యాధునిక కంప్యూటర్లు
- సూపర్ కంప్యూటింగ్ టెక్నాలజీ రంగంలో స్వావలంబన లక్ష్యంలో కీలక ముందడుగు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నేషనల్ కంప్యూటింగ్ మిషన్ ద్వారా దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రదాని నరేంద్ర మోడీ గురువారం ఆవిష్కరించారు. శాస్త్రీయ పరిశోధనలు సులభతరం చేసేందుకు రూ. 130 కోట్లతో పుణె, ఢిల్లీ, కోల్‌కతాలో ఏర్పాటు చేసిన 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్లను ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. మరోవైపు, వాతావరణ పరిశోధనల కోసం రూ. 850 కోట్లతో రూపొందించిన హై పెర్ఫామెన్స్ కంప్యూటింగ్ సిస్టంను కూడా ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ రోజును

2లో..



## కుల గణనకు సిద్ధమవుతున్న తెలంగాణ ప్రభుత్వం

### - ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే అవకాశం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా కులగణన చేపయాలని పట్టుబడుతున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇప్పటి వరకు ఆ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థలు ఎన్నికలు తరుముకొస్తున్న వేళ దీనిపై ప్రభుత్వం ఏం చేయబోతోందనే చర్చ అయితే నడుస్తోంది. ఇలాంటి టైంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్నింటిపై చాలా మందిలో ఉన్న అనుమానాలపై క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్కు అనుగుణంగా సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కులగణనకు సంబంధించిన ప్రకటన వస్తుందని అన్నారు.

### త్వరలో విధి విధానాలు

తెలంగాణలో బీసీలకు అండగా ఉండటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని అన్నారు మహేష్‌గౌడ్. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కట్టుబడి ఉదన్నారు. ఇప్పటికే కొన్ని అమలు చేసింది. కీలకమైన కులగణనకు సంబంధించిన గైడ్‌లైన్ మూడు నాలుగు రోజుల్లో రానున్నాయని తెలిపారు. అవి పూర్తి అయిన తర్వాత బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ల అంశాన్ని తేలుస్తామన్నారు.

ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారని కూడా చెప్పేశారు. త్వరలోనే బీసీ సంఘాలను సీఎం వద్దకు తీసుకెళ్తానని మహేష్ మాట ఇచ్చారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కావాల్సిన డిమాండ్లు, అన్నీ కూడా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్దామన్నారు. అంతే కాకుండా కుల గణన పూర్తైన తర్వాత నిజాం గ్రౌండ్స్‌లో సభ పెట్టి సీఎం రేవంత్‌ను సన్మానిద్దామని పిలుపునిచ్చారు.

### మూడో రాష్ట్రం తెలంగాణ

పార్టీ పదవుల్లో, ప్రభుత్వం పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో, బిహార్‌లో అధికారంలో ఉన్నప్పుడు కుల గణన చేసి చూపించామన్నారు. ఇప్పుడు తెలంగాణలో కూడా చేసి చూపిస్తామని చెప్పుకొచ్చారు.

### బీసీ ఓటు బ్యాంకు కాపాడుకునేలా ప్లాన్

బీసీ రిజర్వేషన్‌లు, ఇతర సమస్యలపై ఓవైపు నుంచి కృష్ణయ్య పోరాటానికి సిద్ధమవుతున్నారు. అదే టైంలో బీఆర్ఎస్ కూడా ఒత్తిడి తీసుకొస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది.

బీసీ సమస్యలు పరిష్కరించి కృష్ణయ్య లాంటి వ్యక్తిని పార్టీలోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బీసీలు తమవైపే ఉండేలా ప్లాన్ చేస్తోంది. అందుకే ఆయన వద్దకు రాయబారం కూడా పంపించారు. రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన కృష్ణయ్యతో మల్లు రవి సమావేశమయ్యారు. పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇటు బీఆర్ఎస్‌కి కూడా అవకాశం ఇవ్వండా ఉండేలా ప్లాన్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల లోపు కుల గణన పూర్తి చేసి సంపూర్ణ ఆధిపత్యం సాధించాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోంది. అందుకు తగ్గట్టుగానే వచ్చే వారంలో కులగణనకు సంబంధించిన కీలక ప్రకటన చేయనుంది.

## మేం జగన్‌లా పారిపోయే వ్యక్తులం కాదు

### - రెడ్ బుక్ పని ప్రారంభమైందన్న మంత్రి లోకేశ్

**శ్రీకాకుళం (ప్రశ్న న్యూస్)** తిరుమల లడ్డూ వివాదం కొనసాగుతోన్న వేళ.. అక్కడికి వెళ్తానంటున్న జగన్ డిక్లరేషన్ ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తే బాగుంటుందని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీకాకుళంలో పాఠశాల ఆకస్మిక పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మనం ఏ మతానికి చెందిన వారమైనా అన్ని మతాలను గౌరవించాలని.. తాము చర్చి, మసీదులకు వెళ్లినప్పుడు వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నడుచుకుంటామని చెప్పారు. తాము జగన్‌లా పారిపోయే వ్యక్తులం కాదని.. సూపర్ సిక్స్ ఆల్రెడీ అమలు చేస్తున్నామని అన్నారు. 'వంద రోజుల్లో సూపర్ సిక్స్ అమలు చేస్తామని నేను ఎక్కడ చెప్పలేదు. మూసేసిన అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పాం ఇచ్చాం. రూ.1000 పెన్షన్ 100 రోజుల్లో పెంచాం.

జగన్ దానికి ఐదు ఏళ్లు తీసుకున్నాడు. మాకు చిత్తశుద్ధి ఉంది. త్వరలో ఉచిత గ్యాస్ ఇస్తాం. ఓ పద్ధతి ప్రకారం ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటాం.' అని లోకేశ్ స్పష్టం చేశారు.

**- తిరుమల లడ్డూ.. విచారణలో వాస్తవాలు**

2లో..



## 4 కోట్ల మంది ప్రజలకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్స్

- తక్కువ వైద్యంతో అందరికీ వైద్యం అందించాల్సిన బాధ్యత ఉందన్న రేవంత్
- 30 రోజుల్లో హెల్త్ కార్డులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడి
- గత చికిత్సల వివరాలను హెల్త్ కార్డుల్లో పొందుపరుస్తామన్న సీఎం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో డిజిటల్ హెల్త్ కార్డులపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్ కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ గురువారం ప్రారంభించిన ఆయన అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్య అందించాల్సి ఉందని అన్నారు. ఎవరైనా ఆసుపత్రికి వెళ్తే తరచూ ప్రాథమిక పరీక్షలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అందుకే రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటలైజ్ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్ డిజిటలైజ్ చేయాల్సి ఉందని ఈ హెల్త్ కార్డుల్లో గత చికిత్స వివరాలు పొందుపరుస్తారని సీఎం రేవంత్ వివరించారు. 'పేదలకు వైద్యం అందించడంలో దుర్గాబాయి

2లో..

## జనసేనలోకి ముగ్గురు వైసీపీ నేతలు

### - పవన్ కళ్యాణ్ సమక్షంలో మాజీమంత్రి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీకి భారీ షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ నుంచి ఒక్కో నేత ఇతర పార్టీల్లోకి వెళ్తుండటంతో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. ఇక పార్టీ మారుతున్న వారిలో చాలామంది ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేనలోకి వలస వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల వైసీపీకి గుడ్‌బై చెప్పిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య తాజాగా పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ముగ్గురు నేతలకు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి జనసేనలోకి సాదర స్వాగతం పలికారు. ఇటీవలే ఈ ముగ్గురు నేతలు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను,

2లో..

## కేటీఆర్‌కు లీగల్ నోటీసులు

### రేవంత్ రెడ్డి బావమరిది లీగల్ నోటీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అమృత్ పథకం టెండర్లలో భారీగా అవినీతి జరిందని ఏకంగా 8888 కోట్ల రూపాయల స్కాం జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అందులో సీఎం రేవంత్ రెడ్డి బావమరిది అయిన సృజన్ రెడ్డికి సంబంధించిన కంపెనీకి రూ.1137 కోట్ల టెండర్లు కట్టబెడ్డారంటూ ఆరోపణలు చేశారు. కాగా.. ఈ ఆరోపణలపై కేటీఆర్ స్పందించారు. తనపై చేసిన నేపథ్యంలో కేటీఆర్‌కు సృజన్ రెడ్డి లీగల్ నోటీసులు ఇచ్చారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ సృజన్ రెడ్డి తెలిపారు. తన పరువుకు భంగం కలిగించే ఆరోపణలు చేసిన కేటీఆర్‌తో

2లో..

## డీజేలపై హైదరాబాద్ సీపీ కీలక వ్యాఖ్యలు

### - బ్యాన్‌పై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ లో డీజేల వాడకం రోజురోజుకు శ్రుతిమించుతోందని.. సీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. అందులోనూ.. మతపరమైన ర్యాలీలు, పెళ్లి బరాత్‌లలో డీజేలు ఉండాల్సిందే అన్నట్టుగా తయారైంది. మొన్నటి వినాయక నిమజ్జనాల సమయంలో.. ఆ తర్వాత జరిగిన మిలాద్ ఉన్ నబి ర్యాలీల్లోనూ డీజేల వాడకం గతంకంటే అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో మతపరమైన కార్యక్రమాల్లో డీజేలు, టపాసుల వాడకంపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన గురువారం (సెప్టెంబర్ 26న) రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి హైదరాబాద్,

2లో..

## చెరువులో నిర్మాణం.. కూల్చిన అధికారులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వందల ఇండ్లు, కోట్ల విలువైన విల్లాలు, వ్యాపార సముదాయాలను హైడ్రా నేలమట్టం చేసింది. కొందరు డబ్బున్న వారు తమ విలాసాల కోసం చెరువులను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. లేక్ వ్యూ కోసం కబ్జాలు చేసి బహుళ అంతస్తుల బిల్డింగ్‌లు నిర్మించారు. తాజాగా.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువులో నిర్మించిన ఓ అక్రమ కట్టడాన్ని హైడ్రా అధికారులు రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సహకారంతో కూల్చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పేలుడు పదార్థాలను ఉపయోగించి అనధికార నిర్మాణాన్ని నేలమట్టం చేశాయి. అయితే ఆ నిర్మాణం చేపట్టిన తీరు విస్మయానికి గురి చేస్తుంది. చెరువు ఒడ్డున కాకుండా ఏకంగా చెరువులోనే నాలుగు అంతస్తుల భవనం నిర్మించారు. చెరువు ఒడ్డు నుంచి బిల్డింగ్ వద్దకు చేరుకోవటానికి స్కైవాక్ తరహాలో మెట్ల నిర్మాణం చేపట్టారు. నీటిలోనే పిల్లర్లు

2లో..

## ఆయుధాలు వీడి రండి.. లేదంటే చస్తారు

### - ఉగ్రవాదులకు అమిత్ షా హెచ్చరిక



**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్)** జమ్మూకాశ్మీర్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. ఉగ్రవాదులతో శాంతి చర్చలకు సిద్ధమేనని అన్నారు. ఆయుధాలు వదులుకుని, ప్రభుత్వంతో చర్చలకు ముందుకు రావాలని లేదా భద్రతా బలగాల చేతిలో చావడానికి సిద్ధంగా ఉండాలని అమిత్ షా తీవ్రంగా హెచచరించారు. జమ్మూకాశ్మీర్‌లోని కరువాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఓటు బ్యాంక్ రాజకీయా కోసం ప్రతిపక్షాలు ఉగ్రవాదులతో చర్చలు జరపాలని అడుగుతున్నాయని.. చర్చలు కావాలనుకుంటే ఆయుధాలు వదిలేసి రావాలని స్పష్టం

2లో..

# పరమ్ రుద్ర సూపర్ కంప్యూటార్లు ప్రారంభం

శాస్త్ర, సాంకేతిక రంగంలో చాలా గొప్ప విజయాలు సాధించిన రోజుగా పేర్కొన్నారు. సాంకేతిక విప్లవ యుగంలో కంప్యూటింగ్ సామర్థ్యం జాతీయ సామర్థ్యానికి ప్రత్యామ్నాయంగా మారిందని తెలిపారు. సాంకేతిక, కంప్యూటింగ్ సామర్థ్యంపై ఆధారపడని రంగమంటూ ఏదీ లేదని ప్రధాని మోడీ చెప్పారు. ఈ సాంకేతిక విప్లవంలో మన వాటా బిట్స్ బైట్స్ లో కాదు.. టెరా బైట్లు, పెటా బైట్లలో ఉండాలని అన్నారు. భారతదేశం సైన్స్, టెక్నాలజీ, పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. 2015లో జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్‌ను ప్రారంభించామన్న ప్రధాని మోడీ.. ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీ ముందంజలో ఉందన్నారు. ఇది ఐటీ, తయారీ, ఎంఎస్ఎంఈలు స్టార్టప్ లను మెరుగుపర్చడంలో సహాయపడుతుందన్నారు. టెక్నాలజీలో పరిశోధనలు సామాన్యులకు ఉపయోగపడేలా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నవారు. పేదలకు సాధికారత కల్పించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చాలన్నారు. సొంతంగా సెమీకండక్టర్ ఏకో సిస్టంను నిర్మించడంతోపాటు ప్రపంచంలోని సరఫరా గొలుసులో కీలకంగా ఉన్నట్లు ప్రధాని మోడీ వెల్లడించారు. సైన్స్ ప్రాముఖ్యత కేవలం ఆవిష్కరణలు, అభివృద్ధి వరకే పరిమితం కారాదని, దేశంలో ఆఖరి పౌరుడి ఆకాంక్షలను కూడా నెరవేర్చేలా ఉండాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

# మేం జగన్‌లా పారిపోయే వ్యక్తులం కాదు

తిరుమల లడ్డూ నాణ్యతా లోపంతో పాటు అనేక సమస్యలను భక్తులు యువగళం పాదయాత్రలో తన దృష్టికి తెచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీని ప్రక్షాళన చేయాలని ఈవోకు చెప్పామని లోకేశ్ తెలిపారు. 'వైవి సుబ్బారెడ్డి అన్ని ధరలు పెంచమని చెప్పి సామాన్యులకు దేవుడిని దూరం చేసే విధంగా ప్రవర్తించారు. తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పుడు తిరుమల లడ్డూ నాణ్యత బాగుందని వైసీపీ ప్రజా ప్రతినిధులు కూడా చెబుతున్నారు. దేవుని జోలికి వెళ్తే ఏం జరుగుతుందో గత ఎన్నికల్లో మీరంతా చూశారు.' అని పేర్కొన్నారు.

### - 'రెడ్ బుక్' పని ప్రారంభం

ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని లోకేశ్ అన్నారు. 'ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెడ్ బుక్ అమలు ప్రారంభమైంది. చట్టాన్ని అతిక్రమించి తప్పు చేసిన వారిని వదలేది లేదు. ఇందులో భాగంగానే ఐపీఎస్ అధికారులు సస్పెండ్ అయ్యారు. రైట్ ప్లేస్‌లో రైట్ పర్సన్ ఉండాలనేదే మా ప్రభుత్వ అభిమతం. గత ప్రభుత్వ హయాంలో యూనివర్శిటీలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారు. వారి హయాంలో ఆయా వర్శిటీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.' అని స్పష్టం చేశారు.విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని కేంద్ర మంత్రి కుమారస్వామి, సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారని లోకేశ్ తెలిపారు. 'ప్రైవేటీకరణ లేదని నేను, మా ఎమ్మెల్యేలందరూ స్పష్టం చేశాం. విశాఖ ఉక్కును బతికించడం కోసం నిధులు మంజూరు చేయాలని సీఎం కేంద్రాన్ని కోరారు. దీనికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. వైసీపీ నేతలు ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడం లేదు. ఇటీవల వరదల సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డాం. ఎవరు అసలైన నాయకులో రాష్ట్ర ప్రజలకు అర్థమైంది.' అని లోకేశ్ పేర్కొన్నారు.

### - విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు

ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందని.. ఫలితంగా ప్రభుత్వ స్కూళ్లల్లో 9 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని లోకేశ్ మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రస్తుతం మన ముందున్న లక్ష్యమని ఇందు కోసం ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నామని అన్నారు. 'గత ప్రభుత్వం రూ.2500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు బకాయి పెట్టింది. గుడ్లు, చిక్కీలకు రూ.200 కోట్లు, నాలుగైదు నెలల నుంచి ఆయాలకు జీతాలు బకాయి పెట్టింది. అవన్నీ పద్ధతి ప్రకారం తీర్చుకుంటూ వస్తున్నాం. నేను జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఒకరోజు పూర్తిగా స్కూళ్ల పరిశీలనకు కేటాయిస్తున్నా. వాస్తవాలను తెలుసుకునేందుకు స్కూళ్లను తనిఖీ చేస్తున్నా.' అని లోకేశ్ పేర్కొన్నారు.

# 4 కోట్ల మంది ప్రజలకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్స్

దేశ్ ముఖ్ హాస్పిటల్ మరొక అడుగు ముందుకు వేయడం అభినందనీయం. క్యాన్సర్ మహమ్మారితో చాలామంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రి యాజమాన్యం మా దృష్టికి తీసుకొచ్చిన ప్రతిపాదనలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తాం. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి.' అని పేర్కొన్నారు.

### - వారికి నియామక పత్రాలు

అనంతరం, తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం రేవంత్ రెడ్డి గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో అనే దానికి కాళేశ్వరం ప్రాజెక్ట్ ఉదాహరణ అని అన్నారు. పై అధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దని నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని అన్నారు. 'నాణ్యతగా లేకుంటే నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టుల వల్ల లక్షల ఎకరాలకు నీరు, విద్యుత్ అందుతుంది. కానీ, ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ అప్పుడే కూలిపోయింది. నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా అధ్యయనం చేయాలి. ఈ ప్రాజెక్టును గత పాలకులు ప్రపంచ అద్భుతంగా వర్ణించారు. క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థంగా పని చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. నిర్మాణ సామగ్రి నాణ్యతగా లేదని ఇంజినీర్లు వెనక్కు పంపి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఓ దేశం గొప్పతనాన్ని చెప్పేది ఆ దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే.' అని సీఎం పేర్కొన్నారు.

### జనసేనలోకి ముగ్గురు వైసీపీ నేతలు

పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యలు.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి షాకిస్తూ వైసీపీకి రాజీనామా చేశారు.

ఈ క్రమంలోనే మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఈ ముగ్గురు నేతలు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరితోపాటు బిజినెస్‌మెన్ కంది రవిశంకర్, విజయనగరం జిల్లా నుంచి వైసీపీ నేతలు అవనపు విక్రమ్ దంపతులు కూడా పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిపోయారు.

ఇక తాను అధికార తెలుగుదేశం జనసేన బీజేపీ కూటమిలో పనిచేయటం కోసమే వైసీపీకి రాజీనామా చేసి జనసేనలోకి వచ్చినట్లు సామినేని ఉదయభాను వెల్లడించారు. జనసేన పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజల కోసం, అభివృద్ధి కోసం, ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసం పనిచేస్తానని ఎలాంటి కండిషన్లు లేకుండా జనసేన పార్టీలో చేరినట్లు ఉదయభాను తెలిపారు. వివాదాలకు వెళ్లకుండా కూటమి పార్టీల నేతలతో కలిసి పనిచేస్తానని చెప్పారు. 30 ఏళ్లకుపైగా తాను రాజకీయాల్లో ఉన్నానని రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని పేర్కొన్నారు.

# కేటీఆర్‌కు లీగల్ నోటీసులు

పాటు బీఆర్ఎస్ పార్టీకి సృజన్ రెడ్డి నోటీసులు జారీ చేశారు. వారు తనపై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ సృజన్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే ప్రతిసారి తనపై ఆరోపణలు చేసే ప్రత్యర్థి పార్టీల నేతలకు లీగల్ నోటీసులు పంపే కేటీఆర్‌కు సృజన్ రెడ్డి లీగల్ నోటీసులు పంపించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

సీన్ రివర్స్ అయ్యిందని తాను చేసిన ఆరోపణలు తనకే బూమరాంగ్ అయ్యాయంటూ కాంగ్రెస్ నేతలు కామెంట్లు చేస్తున్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉన్న పురపాలక శాఖ ద్వారా కేంద్రం అమలు చేస్తున్న అమృత్ టెండర్ల విషయంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారంటూ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని తన బావమరిదికి కోట్ల రూపాయల కాంట్రాక్టులు కట్టబెట్టారంటూ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీకి సంబంధించి అర్హత లేని కంపెనీలకు కూడా కాంట్రాక్టులు కట్టబెట్టారన్నారు. సీఎం బావమరిది సృజన్ రెడ్డికి చెందిన సంస్థకు ఏకంగా రూ.8888 కోట్ల విలువైన టెండర్‌ను అక్రమంగా కట్టబెట్టారంటూ ఆరోపించటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే కేటీఆర్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి కూడా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అమృత్ టెండర్లపై కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని అభిప్రాయపడ్డారు. సృజన్ రెడ్డి అనే వ్యక్తి రేవంత్ రెడ్డికి సొంత బావమరిది కాదని తనకు అల్లుడు అవుతారని చెప్పుకొచ్చారు. సృజన్ రెడ్డికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చారు. వ్యాపారంలో జాయింట్ వెంచర్లు సహజమేనని తెలిపిన కందాల అమృత్ టెండర్లలోనూ అదే జరిగిందంటూ చెప్పుకొచ్చారు.

# డీజేలపై హైదరాబాద్ సీపీ కీలక వ్యాఖ్యలు

సైబరాబాద్, రాచకొండ పోలీస్ అధికారులతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలతో పాటు ఆయా పార్టీల ప్రతినిధులు, మత సంఘాలు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. మాట్లాడిన సీపీ సీవీ ఆనంద్.. డీజేల్లో పెడుతున్న శబ్దాలపై చాలా ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇండ్లల్లో ఉన్న వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారని.. మితిమీరిన సౌండ్స్ వల్ల గుండెలు అదురుతున్నాయని ఆందోళన చెందుతున్నట్టు సీపీ పేర్కొన్నారు. రోజు రోజుకు డీజే సౌండ్స్ శ్రుతి మించుతున్నాయని తెలిపారు. గణేష్ ఉత్సావాలతో పాటు మిలాద్ ఉన్ నబిలోనూ డీజే సౌండ్స్, డ్యాన్సులు విపరీతమయ్యాయని చెప్పుకొచ్చారు. పబ్‌లలో డ్యాన్సులు చేసినట్లే ఆద్యాత్మిక ర్యాలీల్లోనూ చేస్తున్నట్టు సీపీ అభిప్రాయపడ్డారు. డీజే సౌండ్స్ మీద కంట్రోల్ లేకపోతే వాతావరణంలో శబ్ద కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యాలు కూడా తీవ్రంగా దెబ్బ తినే ప్రమాదం ఉందని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీజే సౌండ్స్ కట్టడి చేయాలని కోరుతూ తమకు అనేక సంఘాల నుంచి వినతులు కూడా వచ్చాయని తెలిపారు. డీజేల వల్ల ఆరోగ్య సమస్యలు మాత్రమే కాకుండా భద్రతకు కూడా ముప్పు వాటిల్లే అవకాశాలున్నాయని తెలిపారు. అందుకే పలు వర్గాలను పిలిచామని.. అందరి అభిప్రాయం తీసుకొని ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక ఇస్తామని సీపీ తెలిపారు. తాము నివేదిక ఇచ్చిన తర్వాత ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని సీవీ ఆనంద్ చెప్పుకొచ్చారు.అయితే.. ఇటీవలే.. హైదరాబాద్‌లో డీజేలు బ్యాన్ చేయాలంటూ ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలను బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. దీనిపై హైదరాబాద్‌లో మరో కొత్త వివాదం తెరమీదికి వచ్చింది. అయితే.. ప్రభుత్వానికి పోలీసులు సమర్పించే నివేదికపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. దాంతో.. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందని ఉత్కంఠ నెలకొంది.

## చెరువులో నిర్మాణం..

# కూల్చిన అధికారులు

నిర్మించి జి o1 నుంచి నాలుగు అంతస్తుల్లో భవనం నిర్మించారు. బిల్డింగ్ కట్టిన తీరు చూసి స్థానికులు, అధికారులు విస్తుపోయారు. ఏం తెలివిరా నాయనా చెరువు మధ్యలోనే కట్టేశావంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ఓ కోటీశ్వరుడు దాదాపు దశాబ్ద కాలం క్రితం ఈ బిల్డింగ్ నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. భవన యజమాని వారాంతాల్లో తన కుటుంబంతో సహా సరదాగా గడిపేందుకు ఇక్కడకు వస్తుంటారని వెల్లడించారు. దాదాపు చెరువు మధ్యలోనే బిల్డింగ్ ఉంటుందని.. ఒడ్డు నుంచి బిల్డింగ్ వద్దకు చేరుకోవటానికి స్పైవాక్ తరహాలో మెట్లు నిర్మించినట్లు వెల్లడించారు. నీటి లోపల పిల్లర్లకు బాంబులు అమర్చి బిల్డింగ్ మొత్తం నేలమట్టం చేసినట్లు చెప్పారు. అయితే ఈ కూల్చివేతల్లో అపశృతి చోటు చేసుకుంది. బాంబులతో బిల్డింగ్ కూల్చేవేత పనులు చేపట్టగా పేలుడు ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వెంటనే పోలీసులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఇక హైడ్రా కూల్చివేతలపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. పెద్దల ఇండ్లను వదిలేసి పేదల ఇండ్లు మాత్రమే కూలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అన్నీ పత్రాలు సక్రమంగా ఉన్నా.. కూల్చివేతలు చేపడుతున్నారని బాధితులు మండిపడుతున్నారు. దీనిపై నగరవాసుల్లోనూ భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నారు. కొందరు కూల్చివేతల్ని సమర్థిస్తుంటే మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. ఏది ఏమైనా మల్కాపూర్ చెరువులో నిర్మించిన బిల్డింగ్ మాదిరిగా ఉన్న భవనాలను కూల్చివేయటంలో తప్పు లేదని చాలా మంది అంటున్నారు. ఇలా చెరువులు ఉన్న చోటుకు వెళ్లి నిర్మాణాలు చేపడితే హైదరాబాద్ నగరం ముంపునకు గురి కావటం ఖాయమని చెబుతున్నారు. అందుకే ఇటువంటి కట్టడాలను నేలమట్టం చేయటం సబబే అని సమర్థిస్తున్నారు.

## ఆయుధాలు వీడి రండి..

# లేదంటే చస్తారు

చేశారు అమిత్ షా. లేదంటే భద్రతా బలగాలు వెంటాడుతాయని తేల్చి చెప్పారు. మూడు దశాబ్దాలకుపైగా ఉగ్రవాదం కారణంగా ఎన్నో కష్టాలను అనుభవించి ఇప్పుడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.
ఇదంతా బీజేపీతోనే సాధ్యమైందన్నారు. జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిందన్నారు అమిత్ షా. ఉగ్రవాదాన్ని పాతాళంలోకి తొక్కిపెట్టేవరకు విశ్రమించబోమని ఆయన తేల్చి చెప్పారు. ఈశాన్య భారత్‌లో 10,000 మంది లొంగిపోయారని చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లో మొదటి రెండు దశల పోలింగ్ (సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25న) ముగియగా రికార్డు స్థాయిలో 55 శాతం ఓటింగ్ నమోదైందని తెలిపారు.

## తిరుమల లడ్డు అపవిత్రతను నిరసిస్తూ ఈనెల 30న భారీ నిరసన కార్యక్రమాలు

**- విశ్వహిందూ పరిషత్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తిరుమల తిరుపతి లడ్డు అపవిత్రత హిందూ మనోభావాలను గాయపరచిందని విశ్వహిందూ పరిషత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. లడ్డు తయారీలో గొడ్డు కొవ్వు, పంది కొవ్వు, చేపల మాంసము వంటి వ్యర్థాలను ఉపయోగించడం తిరుమల తిరుపతికి తీవ్రమైన పాపం తలపెట్టారని విశ్వహిందూ పరిషత్ మండిపడింది. గురువారం విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయం కోటిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంస్థ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్వర్ మాట్లాడారు. తిరుమల తిరుపతిలో చేసిన మహా పాపాన్ని సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 30వ తేదీ సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సోమవారం ఉదయం అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టర్ కార్యాలయం ముందు శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. అదేవిధంగా ప్రధాన కూడళ్ళు చౌరస్తాలలో ప్లకార్డులతో శాంతియుత నిరసన తెలియజేస్తామని చెప్పారు. వెంకటేశ్వర స్వామి భక్తులు హిందూ బంధువులు భారీగా హాజరై నిరసన కార్యక్రమాలలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దేవాలయాలలో అన్నిమతా ఉద్యోగస్తులను వెంటనే తొలగించాలని అన్యకాంతమైన దేవాలయాల భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం తొలగించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు దేవాదాయ ధర్మాదాయ శాఖ రద్దుచేసి పూజ పీఠాధిపతులు స్వామీజీలు ధార్మిక సామాజిక పెద్దల నేతృత్వంలో కార్మిక పరిషత్ ఏర్పాటు చేసి దేవాలయాల నిర్వహణ కొనసాగించాలని పేర్కొన్నారు. దేవాలయంలో ఉపయోగిస్తున్న పూజా, ప్రసాద సామగ్రిపై తెలంగాణ ప్రభుత్వం నిర్వహించాలని పేర్కొన్నారు. దేవాలయాల పరిసరాల్లోని వాణిజ్యసమిదాలలో హిందువులు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ నేతలు డిమాండ్ చేశారు.

# పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి.

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని (ప్రశ్న న్యూస్)** పెద్దపెల్లి జిల్లాలోనిఅంగన్ వాడి కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను ప్రత్యేక్షంగా పర్యవేక్షించాలిపెద్దపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలను



తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మెరుగైన విద్య అందించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ పెద్దపల్లి మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హన్మంతునిపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ముత్తారం గ్రామంలో అప్పర్ ప్రైమరీ స్కూల్, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. హన్మంతునిపేట పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివింది అర్థం చేసుకునేలా విద్యార్థుల గ్రహణ శక్తి మెరుగయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాలలో మరమ్మత్తుకు గురైన కంప్యూటర్లను తొలగించాలని, విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందజేయాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని, పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. హన్మంతునిపేట అంగన్ వాడి కేంద్రంలో లైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముత్తారం గ్రామం లోని అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల పరిజ్ఞానాన్ని కలెక్టర్ పరీక్షించారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు మెరుగు పర్చేందుకు లక్ష్యాల నిర్దేశించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి కేంద్రం పరిశీలించిన కలెక్టర్ మరో భవనం లోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్ వాడి కేంద్రాలలో ఉన్న పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా మానిటర్ చేయాలని, ఎత్తు తక్కువ, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పౌష్టికాహారం అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ సమయంలో పాఠశాల హెడ్ మాస్టర్ లు జి. దశ రథం, పి.నాగరాజు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిరిపురం గ్రామపంచాయతీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన. డి ఎల్ పి ఓ,



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండల పరిధిలోని సిరిపురం గుంజపడుగు గ్రామాలలో హెల్త్ క్యాంపు నిర్వహించారుడి ఎల్ పి ఓ మంథని గారు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం లో భాగంగా మంథని మండలం గుంజపాడుగు , సిరిపురం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించడం జరిగింది, తదుపరి వైద్య సిబ్బంది సహకారంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా తేదీ 26/09/2024 రోజున గుంజపాడుగు గ్రామంలో సపాయి మిత్రలకి వైద్య పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు సూచిస్తూ వారికీ కావలిసిన టాబ్లెట్స్ పంపిణి చేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్, డి ఎల్ పి ఓ ,మంథని , పంచాయతీ కార్యదర్శి గుంజపాడుగు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారుద

# మల్లన్న సన్నిధిలో హుండీల లెక్కింపు



**శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)**హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 4,00,65,375/- నగదు రాబడిగా లభించింది.ఇందులో ఆలయ హుండీల ద్వారా రూ.3,86,82,321/-లు మరియు అన్నప్రసాద వితరణ హుండీ ? 13,83,054/- ( 4,00,65,375/-) కాగా ఆలయ హుండీల రాబడిని భక్తులు గత 35 రోజులలో (22.08.2024 నుండి 25.09.2024 వరకు) సమర్పించడం జరిగింది. అదేవిధంగా అన్నదానం హుండీ రాబడి మార్చి 12వ తేదీ నుంచి సెప్టెంబరు 25వ తేదీ వరకు సమర్పించడం జరిగింది. అదేవిధంగా 488 యుఎస్ఏ డాలర్లు, 12 - కువైట్స్ దినార్స్, 6000- ఉగాండా షిలింగ్స్. 30 - యుకే పౌండ్సు, 60 సింగపూర్ డాలర్లు, 20 హంకాంగ్ డాలర్లు 10 - ఈరోస్, 20 - మలేషియా రింగిట్స్ మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీల లెక్కింపులో లభించాయి.పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఆర్. రమణమ్మ, పలు విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

## - ఖీర్ సీటీ పనులు ప్రారంభించిన సిద్ధరామయ్య

**హైదరాబాద్ :** తెలంగాణలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత మూసి ప్రక్షాళన ప్రాజెక్టుతో పాటు ఫోర్త్ సిటీని తన లక్ష్యంగా ప్రకటించారు. హైదరాబాద్, సికింద్రాబాద్,సైబరాబాద్ తర్వాత మరో సిటీని ఫోర్త్ సిటీగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. మెడికల్ టూరిజం, ఏఐ సిటీ, వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఇలా అనేక అంశాలతో ఆ ఫోర్త్ సిటీకి ఇప్పటికే కావాల్సినంత పబ్లిసిటీ వచ్చేసింది . అయితే ఇంకా ఆ సిటీకి శంకుస్థాపన చేయలేదు. కానీ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాత్రం బెంగళూరుకు కాస్త దూరంగా మరో సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేశారు. దానికి ఖీర్ సిటీ అని పేరు పెట్టారు. బెంగళూరు నగరం ఇరుకుగా మారిపోయింది. ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. అందుకే.. మరో కొత్త సిటీని సకల సౌకర్యాలతో అభివద్ధి చేయాలని సంకల్పించారు. ఐఊఎఖీ అంటే నాలెడ్జ్, హెల్త్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ సిటీ. అచ్చంగా రేవంత్ రెడ్డి కూడా ఇదే కాన్సెప్ట్ ను.. ఫోర్త్ సిటీకి అనుకున్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులిద్దరూ ఇదే ప్లాన్ అనుకున్నా సిద్ధరామయ్య ముందుగా శంకుస్థాపన చేసేస్తున్నారు. గురువారం ఖీర్ సిటీకి శంకుస్థాపన చేశారు. ఈ సిటీ ద్వారా రూ. 40 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే 80 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆ రాష్ట్ర పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ ప్రకటించారు. పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్‌తో కర్ణాటక జీడీపీని భారీగా వృద్ధి చేస్తోందని అక్కడి ప్రభుత్వం చెబుతోంది.ఎలాంటి పెట్టుబడికైనా కర్ణాటక అత్యుత్తమ రాష్ట్రమని ఇప్పటికే నిరూపించామని గుర్తు చేస్తున్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్స్‌కు ఖీర్ సిటీని ఓ రోల్ మోడల్‌గా మారుస్తామని అక్కడి ప్రభుత్వం చెబుతోంది. ఖీర్ సిటీ మోడరన్ లివింగ్ అండ్ వర్క్ స్పేస్‌కు ఓ మోడల్‌గా ఉండేలా డిజైన్ చేశారు. ఈ సిటీ ట్రాన్స్ పోర్టుకు కూడా అత్యంత అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు.

బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి యాభై కిలోమీటర్ల దూరంలో ఈ ఖీర్ సిటీని ప్లాన్ చేశారు. బెంగళూరు నుంచి కూడా యాభై కిలోమీటర్ల దూరం ఉంటుంది. దొడ్డబళ్లాపూర దగ్గర అంతర్జాతీయ ఆర్కిటెక్టులతో నగరాన్ని డిజైన్ చేశారు. ఈ సిటీ ద్వారా తాము అద్భుతమైన పెట్టుబడి అవకాశాలను కల్పిస్తున్నామని కర్ణాటక చెబుతోంది.తెలంగాణ కూడా ఇలాంటి సిటీ నిర్మిస్తోంది. ఇక ఏపీ కూడా అమరావతి పేరుతో కొత్త రాజధానిని కూడా అదే రేంజ్ లో నిర్మిస్తోంది. ఇలాంటి అర్బన్ ప్రాజెక్టుల వల్ల మేలే జరుగుతుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

# వరుస ఆఫర్లు... డైలామాలో కృష్ణయ్య

**హైదరాబాద్ :** బీసీ పోరాటల నుంచి రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణయ్యను తెలంగాణ రాజకీయాల్లో వాడుకోవాలని రెండు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయట? కేంద్రంలో పదవి ఇస్తామని ఓ పార్టీ.. రాష్ట్రంలో చూసుకుంటామని మరో పార్టీ ఆయన వెంట పడుతున్నాయని చెబుతున్నారు..బీసీ ఉద్యమనేత ఆర్.కృష్ణయ్య పొలిటికల్ ఫ్యూచర్‌పై తెలంగాణలో విస్తృత చర్చ జరుగుతోంది. బీసీ ఉద్యమం అంటేనే గుర్తుకొచ్చే ఆర్.కృష్ణయ్య గత పదేళ్లుగా రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. తెలంగాణల్లో ప్రభావవంతమైన బీసీ నేతగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఆర్.కృష్ణయ్య కోసం ఎప్పుడూ డోర్స్ ఓపెన్ చేసి ఉంచుతున్నాయి.ఇప్పుడు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్.. ఆర్.కృష్ణయ్యను తమ పార్టీలో చేరమంటే తమ పార్టీలో చేరమని ఆహ్వానిస్తున్నట్లు చెబుతున్నారు. నిన్నటివరకు వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్.కృష్ణయ్య అకస్మాత్తుగా తన ఎంపీ పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. బీసీ ఉద్యమ నేతగా తెలంగాణలో ఆయనకు గణనీయమైన అనుచరగణం ఉండటంతో ప్రధాన పార్టీలు రెండూ కృష్ణయ్య కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.90వ దశకం నుంచి బీసీ ఉద్యమ నేతగా తెలంగాణలో తన ముద్ర వేసిన కృష్ణయ్య? 2014లో తొలిసారిగా ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర విభజన సమయంలో బీజేపీ–టీడీపీ పొత్తుతో టీడీపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్.కృష్ణయ్య ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత టీడీపీ శాసనసభ్యుల్లో ఎక్కువ మంది అప్పటి టీఆర్ఎస్‌లో చేరినా, కృష్ణయ్య మాత్రం సింగిల్‌గానే ఉండిపోయారు. ఇక 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మిర్యాలగూడ నుంచి పోటీ చేసి ఓడిన కృష్ణయ్య, రెండేళ్ల క్రితం ఏపీ నుంచి వైసీపీ తరపున రాజ్యసభలో అడుగు పెట్టారు.ఐతే తెలంగాణలో బలపడాలని భావిస్తున్న బీజేపీ.. ఎప్పటి నుంచో ఆర్.కృష్ణయ్యపై గురిపెట్టినట్లు చెబుతున్నారు. వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు వరుసగా రాజీనామాలు చేస్తుండటంతో కృష్ణయ్యతోనూ రాజీనామా చేయించి పార్టీలోకి తీసుకోవాలని కమలనాథులు స్కెచ్ వేసినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా తమ పార్టీలోకి వస్తే జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.ఇక ఉరుము లేని పిడుగులా? అకస్మాత్తుగా రాజ్యసభకు రాజీనామా చేసిన కృష్ణయ్య మళ్లీ బీసీ ఉద్యమంలో పనిచేస్తానని ప్రకటించినా, ఆయనతో కాంగ్రెస్ నేతలు ప్రత్యేకంగా భేటీ కావడం, సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, బీసీ నేత, మాజీ ఎంపీ వీహెచ్ వంటి వారు కృష్ణయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూ ప్రకటనలు చేయడం ఆసక్తి పెంచేస్తోంది. తాను బీసీ ఉద్యమానికే పరిమితమవుతానని కృష్ణయ్య చెబుతున్నా? రెండు ప్రధాన పార్టీల నుంచి ఆహ్వానాలు ఉండటంతో ఎటూ తేల్చుకోలేక ఆయన అలాంటి ప్రకటనలు చేస్తున్నారని అంటున్నారు. ఒక వైపు కేంద్రం, రెండో వైపు రాష్ట్రం నుంచి పదవులు ఇస్తామని చెబుతుండటంతో ఏ పదవి అయితే బాగుంటుందని ఆయన సన్నిహితులతో చర్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.రాజకీయాల్లోకి వచ్చిన పదేళ్లలో మూడు పార్టీలు మారిన ఆర్.కృష్ణయ్య ఈ సారి ఏ పార్టీలోకి వెళతారనే ఆసక్తి అందరిలో కనిపిస్తోంది.

ముఖ్యంగా తెలంగాణలో బలపడాలని భావిస్తున్న కమలనాథులు? జాతీయ స్థాయిలో ఎలివేషన్ ఇస్తామని చెబుతుండటంతో ఆయన అడుగులు అటువైపు వేస్తారా? లేక లోకల్ ఫీలింగ్‌తో కాంగ్రెస్‌ను ఎంచుకుంటారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. మొత్తానికి పొలిటికల్ చౌరస్తాలో నిలబడిన బీసీ ఉద్యమనేత ఎంపీ పదవిని వదులుకోవడం ఒక ఎత్తైతే? ఇప్పుడు కొత్తగా చేరే పార్టీని ఎంచుకోవడం మరో ఎత్తుగా చెబుతున్నారు. ఏదిఏమైనా కొద్దిరోజుల్లోనే ఈ సస్పెన్స్‌కు తెరపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.

# హైడ్రా బాధితులకు అండగా గులాబీ దళం

**హైదరాబాద్ :** హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రామాలాడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బలిసినోడికి ఒక న్యాయం, పేదోళ్లకు మరొక న్యాయం అంటే ఊరుకునేది లేదన్నారు. దమ్ముంటే పర్మిషన్లు ఇచ్చినోళ్లు, బిల్డర్లపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు.ఆక్రమణలు, తప్పుడు పర్మిషన్లు ఇచ్చిందే కాంగ్రెసోళ్లు అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "మీ మంత్రులు, మీ అన్న ఇళు కూల్చేసి సీఎం రేవంత్ రెడ్డి నిజాయితీ నిరూపించుకోవాలి. హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ న్యాయ పరంగా అండగా ఉంటుంది. బాధితులు తెలంగాణ భవన్ కు రావొచ్చు. మీ ఇబ్బందులు చెప్పొచ్చు. పార్టీ తరపున ఉన్న లీగల్ టీమ్ మీకోసం పోరాడుతుంది. హైడ్రా బాధితుల విషయంలో ప్రభుత్వానికి మానవీయ కోణం ఉండాలి" అని కేటీఆర్ అన్నారు.హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన ఎస్టీపీలను బుధవారం కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన? హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరాన్ని పూర్తి మురుగునీటి రహిత నగరంగా మార్చే ప్రయత్నం చేశామని చెప్పుకొచ్చారు. ఇవాళ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ ఎస్టీపీని తమ పార్టీ బృందం సందర్శించిందని తెలిపారు. ఎస్టీపీల సందర్శనల్లో ఇది మొదటి అడుగు మాత్రమే అన్న ఆయన? మిగిలిన ఎస్టీపీలను కూడా సందర్శిస్తామని ప్రకటించారు"వందశాతం మురుగునీటిని శుద్ధి చేసిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని మ ప్రభుత్వ లక్ష్యంగా ఉండే. ఈ శుద్ధి చేసిన పూర్తి స్వచ్ఛమైన నీరు మూసీ నదిలోకి పోతుంది. హైదరాబాద్ నగరంలోని 94 శాతం స్వచ్ఛమైన నీరు మూసికి వెళ్తున్నప్పుడు మూసి నీటిని శుద్ధి చేయాల్సిన అవసరం ఏముంది..? వంద శాతం మురుగునీటి శుద్ధి జరిగిన తర్వాత మూసి ప్రాజెక్టు కోసం లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఏమున్నది.. ? ఈ ప్రాజెక్టుకు సంబంధించి మంత్రులు, ప్రభుత్వం రూ. 50 వేల కోట్లు, రూ. 70,000 కోట్లు, రూ. 1,50,000 కోట్లు అంటూ పూటకు ఒక మాట మాట్లాడుతున్నారు. అందుకే ఈ మూసీ నది ప్రక్షాళనపైన అనేక అవినీతి తాలూకు అనుమానాలు వస్తున్నాయి" అని కేటీఆర్ విమర్శలు చెప్పారు."హైదరాబాద్ నగరంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టలేం అని ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతున్నారు. అదే నిజమైతే మూసీ నది నుంచి తొలగించే పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎట్లా ఇస్తామన్నారు..? మేము హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం భారీగా భూమిని సేకరించి సిద్ధంగా ఉంచితే అది రద్దు అంటూ పూటకో మాట మాట్లాడుతున్నారు. గతంలో మా ప్రభుత్వం చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి" అంటూ ప్రభుత్వానికి హితవు పలికారు.త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఒక కార్యచరణ ప్రకటిస్తామని కేటీఆర్ చెప్పారు.

హైదరాబాద్ నగరంలో ఎక్కడ పేదల ఇల్లు కూలకొట్టినా.. హైదరాబాద్ నగరంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొన్న హైడ్రా వాళ్ళు ఇల్లు కూలకొట్టినప్పుడు చిన్న పాప వేదశ్రీ మాట్లాడిన మాటలు ప్రతి ఒక్కరిని కదిలించాయని గుర్తు చేశారు.

# శిశువు కిడ్నాప్ కథ సుఖాంతం

**సికింద్రాబాద్ :** గాంధీ ఆస్పత్రి నుంచి రెండు రోజుల వయసు ఉన్న శిశువు అపహరణకు గురి కావడం తీవ్ర సంచలనానికి దారి తీసింది. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అపహరణకు శిశువు ఉదంతాన్ని కొద్దీ గంటల్లోనే ఛేదించి సురక్షితంగా శిశువును తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. నల్గొండ జిల్లా గుండాల మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన సుభాన్, షాహినా భార్యాభర్తలు. వారికీ ఇద్దరు ఆడపిల్లలు. బాబు కోసమని మరల గర్భం దాల్చిన షాహినాకు నొప్పులు రావడంతో ఈ నెల 24న, ఉదయం గాంధీ ఆసుపత్రిలోని మాతా శిశు సంక్షేమ కేంద్రం (ఎంసీహెచ్)లో అడ్మిట్ చేశారు. అదే రోజు ఉదయం పదిన్నర గంటలకు బాబుకు జన్మనిచ్చింది. అయితే బుధవారం ఉదయం 11-30 గంటల సమయంలో షాహినాకు కొన్ని టెస్టులు చేయాల్సి ఉండడంతో బాబును అక్కడే వదిలేసి వెళ్ళింది. తిరిగి వచ్చేవరకు తన బాబు కనిపించక పోవడంతో ఆసుపత్రి వర్గాల సహాయంతో అవుట్ పోస్ట్ లో పిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఒక మహిళ బాబును అపహరించినట్లు గుర్తించారు.

## భాజపా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో

# పాల్గొన్న పురందేశ్వరి

**గన్నవరం** ఎన్టీఆర్ జిల్లా జక్కుల నెక్కలం గ్రామంలో భాజపా పార్టీ సభ్యత్వ నమోదుకార్యక్రమంలో భాజపా పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. జక్కుల నెక్కలం గ్రామంలో స్థానిక ప్రజల మొబైల్స్ లో భాజపా పార్టీ సభ్యత్వం నమోదు చేసారుపురందేశ్వరి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సభ్యత నమోదుని ఈనెల రెండో తారీఖున ప్రారంభించడం జరిగింది. మొట్టమొదటి భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు చేసిన భారత ప్రధాని నరేంద్ర మోడీ.

నిబద్ధతో అంకితభావంతో పనిచేస్తున్నరు కాబట్టి మంచి స్పందన వస్తుంది. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి భారతీయ జనతా పార్టీలో సభ్యత్వ నమోదు చేసుకుంటున్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఈ గ్రామమే కాబట్టి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. బుడమేరు వరద ముంపుకు నీట మునిగి పాడైన పంటలను పరిశీలించాం. వరదలు వచ్చిన టైంలో మంత్రితోపాటు నేను వచ్చాను ఈ గ్రామానికి రాలేకపోయాను. చాలావరకు పంట కావచ్చు ఇళ్ళు కావచ్చు ఇమ్యునరేషన్ జరిగింది.పంట నష్టపోయిన వారు కొంతమంది మిగిలిపోయారు అని మా దృష్టికి వచ్చిందని అన్నారు.కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి వారి పేర్లు నమోదు చేశారు. సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది వారి మా సహకారం ఉంటుంది.ఈ వర్షాల కారణంగా సభ్యత్వ నమోదు ఆలస్యమైంది అయినా ప్రజలు ముందుకు వచ్చి భారతీయ జనతా పార్టీని స్వాగతిస్తున్నారు ముందు ముందు పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు.

# కువైట్‌లో కడప మహిళకు కష్టాలు

**కడప** తినేందుకు తిండి లేక, తలదాచుకునేందుకు ఆశ్రమం లేక తాను తన ఇద్దరు పసి పిల్లలు కలిసి కువైట్ లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమను కువైట్ నుండి ఇండియాకు రప్పించి కాపాడాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లను వేడుకుంటూ అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ మహిళ సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని రాజుల కాలనీ కి చెందిన షేక్ బీబీ (38) అనే మహిళ బతుకు తెరువు కోసం ఐదేళ్ల క్రితం గల్ఫ్ దేశమైన కువైట్ కు వెళ్ళింది. అక్కడ ఓ షేట్ ఇంట్లో పని మనిషిగా పనిచేస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఆమెకు ఆ ఇంట్లో పని ఒత్తిడి ఎక్కువ కావడంతో ఇంట్లో నుండి పరారీ అయి బయట తలదాచుకుంది. అక్కడ కడప జిల్లా మైదుకూరు కు చెందిన దస్తగిరి భాషా తో పరిచయం ఏర్పరచుకుంది. వీరి పరిచయం ప్రేమగా మారింది. ఇరువురు కువైట్ లోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బయట పనులు చేసుకుంటూ అక్కడే సహజీవనం సాగిస్తూ వచ్చారు. వీరిద్దరికీ ఇద్దరు ఆడబిడ్డలు సంతానం కలిగారు. ఈ క్రమంలో ఓ రోజు పోలీసుల తనిఖీల్లో భాగంగా దస్తగిరి భాష మద్యం సేవించి పోలీసులకు పట్టుబడడంతో అతనికి పోలీసులు ఫింగర్ వేసి ఇండియాకు పంపి వేశారు. అప్పటి నుండి షేక్ బీబీ తన ఇద్దరు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తినేందుకు తిండి లేక, చేతిలో డబ్బులు లేక, తలదాచుకునేందుకు ఆశ్రమం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండియాకు వచ్చేందుకు షేక్ బీబీ కి అకామ లేకపోవడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి కువైట్ లో మరింత తీవ్ర ఇబ్బందులు పడుతుంది. తనను, తన పిల్లలను ఎలాగైనా కువైట్ నుండి ఇండియాకు రప్పించాలంటూ బాధిత మహిళ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేష్, రాంప్రసాద్ రెడ్డి లను వేడుకుంటుంది.

## చిరుత పులిని పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు.

**రాజమండ్రి** కడియం నర్సరీలో చిరుత తిరుగుతున్నట్లు స్థానిక రైతులు సమాచారంతో అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించి ఇవి చిరుత పులి పాదముద్రలుగా గుర్తించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా అటవీ శాఖ అధికారిణి భరణి, కోనసీమ జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జాగ్రత్తలు తెలిపారు.

చిరుత సంచారం కలకలం రేపిందన్న వార్తల నేపథ్యంలో జిల్లా అటవీ శాఖాధికారులను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అటవీశాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిరుతను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసాఇచ్చారు. అలాగే చిరుత కదలికలు గుర్తించేందుకు నర్సరీలలో 20 ట్రాప్ కెమెరాలను అమర్చారు. అలాగే రెండు బోనులలో చిరుతకు ఎరగా మేక పిల్లను, పందిని అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కాగా బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమీపంలో చిరుత పులి కదలికను పాదముద్రల ద్వారా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం చిరుత పులి బుర్రిలంకకు సమీపంలో ఓ నర్సరీలో గుబురుగా గల ఈత చెట్ల పొదలలో ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మందుబాబు హల్ చల్

**హైదరాబాద్** డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మందు బాబు హల్చల్ చేశాడు. చంపాపేట ప్రధాన రహదారిపై మీర్ చౌక్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నయీముద్దీన్ .ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఆసమయంలో అక్కడికి ఆటో ను ఆపేందుకు పోలీసులు యత్నించారు. అతడి ఆపకుండా అడ్డంగా ఉన్న పోలీసుల పైకి తీసుకువెళ్ళే విధంగా ముందుకు సాగాడు. ఆటోను అపి పరీక్షించ మద్యం సేవించినట్లు నిర్ధారణ ఆయి నీది. పోలీసులతో వాగ్వాదానికి దిగాడు.చివరకు పోలీసులు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశారు

# భారీ వర్షాలకు నీట మునిగిన ఇళ్లు

**హైదరాబాద్** హైదరాబాద్ మీర్పేట్ లోని మిథిలా నగర్, సత్య సాయి నగర్ లో ఇళ్లు నీట మునిగాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా చేరింది. వరద నీటి కోసం వేసిన పైప్ లైన్లు మూసుకుపోవడంతో నీరు ఇళ్లలోకి చేరింది. గత సంవత్సరం ఎన్నో కోట్లు వెచ్చించి ఎస్ ఎన్ టి పి నాలా పనులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేపట్టారు. అయినప్పటికీ ఎటువంటి ఫలితం దక్కలేదు.

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న

# మంత్రి నారా లోకేష్



**విశాఖపట్నం** సింహాచలంలో వేంచేసి ఉన్న శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి వారిని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం లోకేష్ స్వామివారికి పూజలు నిర్వహించారు. వేదపండితులు లోకేష్ కు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## న్యూయార్క్‌లో వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమైన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రపంచ బ్యాంకు సహజ వనరుల పరిరక్షణ ప్రాజెక్ట్ ప్రతినిధి మైక్ వెబ్‌స్టర్ తో సమావేశమైన మంత్రి కొండపల్లి వరదలు కరువు నివారణ చర్యలపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్న మైక్ వెబ్‌స్టర్.చిత్తూరు జిల్లాలో తాము చేపట్టిన కార్యక్రమాలకు చంద్రబాబు ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారాన్ని గుర్తుచేసుకున్న మైక్ వెబ్‌స్టర్ సౌరశక్తి రంగంలో నూతన ఆవిష్కరణలపై జోనాథన్ బెర్మాన్,

## మీరా షాతో చర్చించి మంత్రి శ్రీనివాస్



**న్యూయార్క్/అమరావతి** ప్రపంచ బ్యాంకు 2030 నీటి వనరుల ప్రోగ్రామ్ మేనేజర్ మరియు సహజ పరిరక్షణ ప్రాజెక్ట్ ప్రతినిధి మైక్ వెబ్‌స్టర్ తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, పవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ న్యూయార్క్ లో సమావేశమయ్యారు. వరదలు, కరువు నివారణకు ప్రకృతి ఆధారిత పరిష్కారాలపై ఈ సమావేశంలో చర్చించారు. మైక్ వెబ్‌స్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పని విధానాన్ని, పకృతి వనరులను కాపాడటంలో ఆయన కున్న చిత్తశుద్ధిని కొనియాడారు. గతంలో చిత్తూరు జిల్లాలో తమ బృందం పనిచేసిన అనుభవాన్ని, అప్పట్లో తమకు అందిన ప్రోత్సాహన్ని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో తమకు అవకాశం అవకాశం కల్పిస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో వరదలు, కరువు నివారణ కోసం తప్పకుండా కలిసి పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వరదలు, కరువు నివారణ చర్యలపై చేపట్టే ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంక్ ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని మైక్ వెబ్‌స్టర్ హామీ ఇచ్చారు. మైక్ వెబ్‌స్టర్ హామీ ఇవ్వడం పట్ల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు. షెల్ ఫౌండేషన్ సీఈఓ జోనాథన్ బెర్మాన్ మరియు పోర్ట్‌ఫోలియో అధిపతి మీరా షాతో సమావేశమైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సన్న, చిన్నకారు రైతులు, గ్రామీణ పేదరిక నిర్మూలన (ూఇఖీఖ) కార్యకలాపాల గురించి చర్చించారు. వ్యవసాయం రంగంలో సౌరశక్తి వినియోగాన్ని పెంచడం కోసం, నూతన ఆవిష్కరణలను రావల్సిన అవసరాన్ని మంత్రి శ్రీనివాస్ జోనాథన్ బెర్మాన్, మీరా షాతో చర్చించారు. సౌరశక్తి రంగంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావడంలో వారు ఎలా సహకరించాలి అనే విషయంపై మంత్రి చర్చించారు.

# ఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం

## - ఇద్దరు సజీవ దహనం



**చిత్తూరు** బంగారుపాళ్యం మండలం, మొగిలి ఘాట్ రోడ్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు లారీలు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఇద్దరు సజీవ దహనం అయ్యారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. లారీ అతివేగంగా వచ్చి ఆగివున్న కొయ్యల లోడ్ లారీని వెనుకవైపు నుండి ఢీ కొనడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగి లారీ కింద నిద్రిస్తున్న డ్రైవర్, మరియు లారీ లోపల నిద్రిస్తున్న క్లినర్ మంటల్లో చిక్కుకుని మృతి చెందారు. వెనక ఢీ కొన్న లారీ డ్రైవర్, క్లినర్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న ఫెయిర్ సిబ్బంది మంటలను అదుపు చేసేలోపే పూర్తిగా దగ్ధమైంది. బంగారుపాళ్యంలో వరస రోడ్డు ప్రమాదాలపై ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న బంగారుపాళ్యం పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కోవర్టు అధికారులు .. గుర్రుగా రేవంత్ సర్కార్

**హైదరాబాద్ :** సాధారణంగా ప్రభుత్వ పరిపాలనకు సంబంధించి అంతర్గతంగా జరిగే విషయాలు రహస్యంగా ఉంటాయి. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత.. అంతర్గత విషయాలు బహిర్గతమవుతున్నాయి. కేబినెట్ నిర్ణయాలు వెంటనే తెలిసిపోతున్నాయి. పథకాల సంబంధించిన సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాలు బయటకు చేరిపోతున్నాయి.. ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించడం పూర్తికావడమే ఆలస్యం.. ఆ సమాచారం మొత్తం గులాబీ నేతలకు తెలిసిపోతుంది. దీంతో గులాబీ నాయకులు వెంటనే తమ వాయిస్ వినిపిస్తున్నారు.. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రభుత్వం తీరిగ్గా ఇన్ని రోజులకు “గులాబీ” బ్యూరోక్రాట్లపై నజర్ పెట్టిందని తెలుస్తోంది. కొంతమందికి వార్నింగ్ కూడా ఇచ్చినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆ అధికారులు తమ తీరు మార్చుకోవడం లేదని.. ప్రచారం జరుగుతోంది. ఇటీవల కొంతమంది మంత్రులు వివిధ అంశాలపై కీలక అధికారులతో చర్చించారు. అయితే ఆ విషయం కూడా భారత రాష్ట్ర సంత నేతలకు తెలిసింది.. దీంతో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో మంత్రులు నిర్వహించిన సమావేశం వివరాలను కూడా వారు వెల్లడించారు. దీంతో ఆ మంత్రులకు ఒక్కసారిగా షాక్ తగిలింది. ఫలితంగా వారు ఆ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఎన్నిసార్లు సదరు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. అయితే కీలకమైన సమాచారాన్ని బ్యూరోక్రాట్లు ఎందుకు గులాబీ నేతలకు చేరవేరుస్తున్నారు? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ గులాబీ నాయకులతో ఎందుకు అంత సన్నిహితంగా ఉంటున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయినప్పటికీ.. ఎందుకు బ్యూరోక్రాట్లు సర్కార్ కు దగ్గర కాలేకపోతున్నారు? రేవంత్ రెడ్డి కూడా అధికారుల మనసులు ఎందుకు గెలవలేక పోతున్నారు? ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ గులాబీ నేతలతో అధికారులు సన్నిహితంగా ఉండడానికి కారణం ఏంటి? ఇప్పుడు ఈ ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది. అయితే ఇటీవల ఏసీబీ దాడులు పెరిగిపోవడం.. కొందరు అధికారులను ప్రభుత్వం లూప్ లైన్లోకి పంపించడం.. కోరుకున్న చోటుకు బదిలీలు చేయకపోవడం.. వంటి కారణాలవల్ల బ్యూరోక్రాట్లు ప్రభుత్వానికి దూరంగా ఉంటున్నట్టు తెలియవస్తోంది. మరి ఈ సమస్యకు రేవంత్ రెడ్డి ఎలాంటి పరిష్కారం చూపుతారో వేచి చూడాల్సి ఉంది. “ ప్రభుత్వ అంతర్గత సమాచారం ఎప్పటికప్పుడు భారత రాష్ట్ర సమితికి చేరిపోతోంది. దీనివల్ల ప్రభుత్వానికి సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే ఈ సమస్యను రేవంత్ ఇప్పటికే పరిష్కరించారని.. మిగిలిన వారిని కూడా సెట్ రైట్ చేస్తే ఇబ్బంది ఉండదని” కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. కేటీఆర్ డిమాండ్స్.... సాయంత్రానికి సర్కార్ జీవోలు కొంత కాలంగా బీఆర్ఎస్ ముఖ్యనేతలు ప్రెస్మీట్లలో చేసిన డిమాండ్లు.. సాయంత్రానికి సర్కారు ఉత్తర్వులుగా వెలువడడం కనిపిస్తున్నది. దీనిని బట్టి చూస్తుంటే ప్రభుత్వ యంత్రాంగంలోని వివిధ శాఖల్లో ఇంకా గులాబీ కోవర్టులు ఉన్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఏకంగా ముఖ్యమంత్రి నిర్వహించబో?యే సమీక్షలు, అందులోని అంశాలు ముందుగానే ప్రతిపక్ష బీఆర్ఎస్ ముఖ్యనేతలకు తెలిసిపోతున్నాయన్న సందేహాలు కలుగుతున్నాయి.తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రెస్మీట్ పెట్టారు. నిరుపేదలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వారి ఇండ్లను హైడ్రా కూల్చుతున్నదని, పెద్దల ఇండ్లకు మాత్రం నోటీసులు ఇచ్చి అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కట్టిన 40వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని హైడ్రా బాధితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి దిక్కు లేని నిరుపేదలే నాలాల పైన నిర్మాణాలు కట్టుకుంటారని, అలాంటి వారిని గుర్తించి ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే వారి నిర్మాణాలు తొలగించాలని కోరారు జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా మూసీ రివర్ ఫ్రంట్, మెట్రో రైలు మార్గం విస్తరణ ప్రధాన అంశాలుగా ఉన్నాయి. మూసీ పరీవాహక ప్రాంత బఫర్ జోన్లో ఉన్న వారి వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. వారికి ప్రత్యామ్నాయం చూపి నది పరీవాహకంలో నిర్మాణాలను తొలగించాలని సూచించారు. ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటల ఆక్రమణ వివరాలు తెలుసుకుని నివేదిక ఇవ్వాలని, వాటి పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశం ముగిశాక సాయంత్రం మూసీ పరీవాహక నిర్వాసితులకు 16వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఉదయం కేటీఆర్ విలేకరుల సమావేశం పెట్టడం, హైడ్రా బాధితుల సమస్యలను ప్రస్తావించడం, బీఆర్ఎస్ నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను బాధితులకు ఇవ్వాలని డిమాండ్ చేయడం, ఇదే క్రమంలో ప్రభుత్వం సాయంత్రమే మూసీ పరీవాహక నిర్వాసితులకు 16వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ కావడం చూస్తుంటే పలు అనుమానాలు కలుగుతున్నాయి.వివిధ శాఖల్లోని ఉన్నత అధికారులు ప్రభుత్వం నిర్వహించే సమీక్షలపై ముందే బీఆర్ఎస్ ముఖ్యనేతలకు ఉప్పందిస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి ఏ అంశాలపై సమీక్ష నిర్వహించబోతున్నారు? ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నారు? అనే విషయాలు ముందుగానే ప్రతిపక్ష పార్టీ పెద్దలకు చేరుతున్నట్టు సందేహాలు వస్తున్నాయి. మంగళవారం నిర్వహించే సమీక్ష వివరాలు సైతం బీఆర్ఎస్ ముఖ్య నేతలకు తెలియడం వల్లే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమీక్షలో తీసుకోబోయే నిర్ణయాలకు తగినట్టుగా మాట్లాడారనే సందేహాలు కలుగుతున్నయి.

ఇప్పటికీ గత ప్రభుత్వంతో కలిసి పని చేసిన అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో సత్సంబంధాలు మెయింటేన్ చేస్తున్నారని, ప్రభుత్వం పెద్దల హెచ్చరిలకు బేఖాతరు చేస్తూ ఇంటర్నల్ విషయాలను లీక్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.అదీగాక గత ప్రభుత్వ పెద్దల నిర్ణయాలు, సమీక్షల తీరు, పాలకుల ఆలోచనలు ఉన్నతంగా ఉండేవని, వారిని ఆదర్శంగా తీసుకున్న అధికార పెద్దలు కొందరు ఇప్పటికీ వారికి బంట్లుగా పనిచేస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. ఇలా ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం ముందుగానే ప్రతిపక్షానికి తెలుస్తుండడం, వివిధ శాఖల్లో బీఆర్ఎస్ దోస్తులు ఉన్నట్టు తెలుస్తుండడం అధికార పార్టీకి మింగుడుపడని వ్యవహారంలా మారిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

## నార్సింగి స్టేషన్...
# కేరాఫ్ వీఐపీ కేసులు

**హైదరాబాద్ :** నార్సింగి ఠాణా లవ్ బ్రేకప్ ఇష్యూలకు స్పాట్‌గా మారింది. లా అండ్ ఆర్డర్, డ్రగ్స్ వంటి కేసులు కన్నా లవ్ షికాయతులే ఎక్కువగా నార్సింగి పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. వాటిల్లో మేజర్ కేసులు సినిమా వాళ్లకు చెందినవే కావడం గమనార్హం.లేటెస్ట్‌గా హర్షసాయిపై రేప్ కేసు ఫైలయింది నార్సింగి పీఎస్‌లోనే. ఇక రీసెంట్‌గా సంచలనం రేపిన జానీ మాస్టర్ కేసును నార్సింగ్ పోలీసులే డీల్ చేస్తున్నారు. ఆ మధ్య లావణ్య–రాజ్ తరుణ్ వివాదం సినిమాను తలపించింది. ఇంకా సీరియల్‌లా కొనసాగుతూనే ఉంది. రాజ్ తరుణ్‌కు తనకు పెళ్లయిందని.. లివ్ ఇన్ రిలేషన్‌లో ఉన్నామని.. మాల్వీ వల్లే తమ మధ్య గొడవలొచ్చాయని.. రాజ్ తరుణ్ తనను మోసం చేశారంటూ నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు లావణ్య. పరిచయం నిజమే కానీ తమకు పెళ్లి కాలేదని..అసలు మ్యారేజ్‌పై తనకు ఇంట్రెస్ట్ లేదన్నారు రాజ్ తరుణ్. అలా వాదోపవాదాలు సంచలనం రేపాయి. రీసెంట్‌గా మరోసారి కంప్లేంట్ ఇచ్చారు లావణ్య. తన బంగారం, పుస్తెల తాడు, తాళి బొట్టు, డాక్యుమెంట్లు చోరీ చేశారని ఆరోపిస్తూ రాజ్ తరుణ్, మాల్వీపై నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది లావణ్యరాజ్‌తరుణ్ ? లావణ్య కేసులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి, మోసం చేశారని లావణ్య చేసిన ఆరోపణల్లో నిజం ఉందని పోలీసులు నిర్ధారించారు. వాళ్లిద్దరూ పదేళ్లుగా ఒకే ఇంట్లో ఉన్నట్లుగా తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. దర్యాప్తులో భాగంగా లావణ్య ఇంటి వద్ద సాక్ష్యాలు, పలు కీలక ఆధారాలు కూడా సేకరించినట్లు చార్జ్‌షీట్‌లో ప్రస్తావించారు. అయితే ఈ కేసులో ముందుస్తు బెయిల్ తెచ్చుకున్నాడు రాజ్ తరుణ్.జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించాడని.. తన మాట వినకపోతే ఇండస్ట్రీలో అవకాశాలు లేకుండా చేస్తానని బెదరించాడంటూ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ 40 పేజీల్లో తన ఆవేదనను..జానీమాస్టర్‌తో పరిచయం..ఔట్ డోర్ షూటింగ్‌లో లైంగిక దాడి.. వంటి అంశాలు సహా జానీ మాస్టర్ భార్య కూడా తనపై దాడి చేసిందని కంప్లైంట్ ఇచ్చారామె. ముందుగా రాయదుర్గం పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ.. బాధితురాలు ఫిర్యాదు ప్రకారం ఆమెపై దాడి జరిగిన ప్రాంతం నార్సింగి పీఎస్ పరిధిలో ఉండడంతో కేసును అక్కడకు ట్రాన్స్‌ఫర్ చేశారు. గోవాలో జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఆయన్ని కోర్టులో ప్రవేశపెట్టడం.. 14 రోజుల రిమాండ్ పడడం తెలిసిందే. పోక్సో సహా పలు సెక్షన్ల కింద జానీ మాస్టర్‌పై కేసు ఫైల్ చేశారు నార్సింగిపోలీసులు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయన్ని కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు.ఇక బిగ్‌బాష్ ఫేమ్ షణ్ముఖ్ జస్వంత్ కేసు అప్పట్లో సంచలనం రేపింది. తాజా జానీ మాస్టర్, హర్షసాయి కేసుల తరహాలోనే షణ్ముఖ జస్వంత్ కంటెంట్ కూడా సేమ్ టు షేమే. ఆ కేసును డీల్ చేసింది కూడా నార్సింగి పోలీసులే. షాట్‌ఫిల్మ్‌లో ఛాన్స్ పేరిట షణ్ముక్, అతని సోదరుడు సంపత్ వినయ్ తనను మోసం చేశారని బాధితురాలు నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. సంపత్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మరొకర్ని మ్యారేజ్ చేసుకున్నాడని కంప్లేంట్ ఇచ్చారామె. అంతేకాదు పర్సనల్ వీడియోలను సోషల్ మీడియాలో పెడుతామని బ్లాక్ మెయిల్ చేశారన్నారు. కేసును టేకప్ చేసిన పోలీసులు విచారణ బాగంగా నానక్‌రామ్ గూడాలోని షణ్ముఖ్ ఇంటికి వెళ్లి చేస్తే గంజాయి గుట్టు బయటపడింది.ఇక మరో ప్రముఖ యూట్యూబర్ చందు సాయి కేసును కూడా నార్సింగి పోలీసులే డీల్ చేశారు. నార్సింగికి చెందిన యువతిని చందు సాయి ప్రేమ పేరుతో మోసం చేశాడనేది అభియోగం. అతనిపై అత్యాచారం, మోసం కేసు నమోదైంది. ఈ కేసులో జైలుకు వెళ్లిన చందు సాయి బెయిల్‌పై బయటకు వచ్చాడు.ఇక ఇప్పుడు యూ ట్యూబర్ హర్ష సాయి పై అత్యాచారం కేసు ఫైలయింది కూడా నార్సింగ్ పీఎస్‌లోనే. పాన్ ఇండియా మూవీ సంగతి ఏమో కానీ రేప్, 2 కోట్ల దగా, బ్లాక్ మెయిలింగ్ ఆరోపణలతో హర్షసాయి డర్టీ పిక్చర్ నార్సింగి పీఎస్ రికార్డులకెక్కింది. అదేం చిత్రమోకానీ లా అండ్ ఆర్డర్ కేసులకన్నా ఇట్లాంటి కేసులకు నార్సింగ్ పీఎస్ కేరాఫ్‌గా మారిందనే టాక్ పీక్స్‌కు వెళ్లింది.

# నాసిరకం వెల్లుల్లి పేస్టు స్వాధీనం

## – నలుగురు అరెస్టు

**వికారాబాద్** చౌడపూర్ మండల కేంద్రంలో కుళ్లిన పదార్థాలతో కల్తీ అల్లం మరియు వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠా ను జిల్లా టాస్క్ ఫోర్స్, పరిగి పోలీస్ అధికారులు పట్టుకున్నారు.
పోలీసులకు అందిన సమాచారం మేరకు చౌడాపూర్ మండల కేంద్రంలోని శశిధర్ కిరాణా దుకాణంలో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ అమ్ముతున్నారు అని, తెల్సుకొని కిరాణం దుకాణం లో చెక్ చేసారు. నకిలీ, కల్తీ అల్లం వెల్లుల్లి డబ్బాలు దొరికాయి. షాప్ యజమానిని విచారించగ అతను మహబూబ్ నగర్ లోని బాలకృష్ణ, వెంకటేశ్వర్లు ద్వారా కొనుగోలు చేసానని చెప్పాడు. బాలకృష్ణ, వెంకటేశ్వర్లు లను అదుపులోకి తీసుకుని విచారించారు. కీసర మండలం లోని దామోదర్ రెడ్డి దగ్గర తీసుకున్నామని వెల్లడించారు.

వెంటనే దామోదర్ రెడ్డిని తీసుకోని విచారించి కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నా ముకుంద జింజర్ , గార్లిక్ పేస్ట్ ఇండస్ట్రీ పైన రైడ్ చేయగా సుమారు 200 కిలోల కుళ్ళిపోయిన నాసిరకం అల్లం,వెల్లుల్లి పేస్ట్, తయారీకి ఉపయోగించే సిట్రిక్ యాసిడ్, ఏసిటిక్ యాసిడ్ మరియు టెస్టింగ్ సాల్ట్ లను స్వాధీనం చేసుకున్నారు. . కుళ్ళిపోయినా, వివిధ కెమికల్స్ వేసి తయారు చేసిన మొత్తం 938 కేజీల అల్లం వెల్లుల్లి పేస్ట్, 200 కేజీల కుళ్ళిపోయిన ఎల్లిపాయలు మొత్తం 1138 కేజిలు టాస్క్ ఫోర్స్ టీం అధికారులు స్వాధీనం చేసుకొని కుల్కచర్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి నిందితులు శశిధర్, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, దామోదర్ రెడ్డి లను రిమాండ్ కు తరలించారు.

# రియల్ ఎస్టేట్‌పై హైడ్రా ఎఫెక్ట్...

**హైదరాబాద్ :** దరాబాదులో రియల్ ఎస్టేట్ రంగంపై హైడ్రా ప్రభావం చూపించిందని తెలుస్తోంది. దేశంలోనే 9 ప్రధాన నగరాలలో జూలై నుంచి సెప్టెంబర్ నెల మధ్య గృహాల విక్రయాలపై ప్రాప్ డిప్యూటీ అనే సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. నివేదిక ప్రకారం హైదరాబాదు నగరంలో రియల్ ఎస్టేట్ రంగంలో గృహాల విక్రయాలు 42% క్షీణించాయి. ఆ తర్వాత బెంగళూరు 26%, కోల్ కతా 23%, పుణె 19 %/, చెన్నై 18 %, ముంబై 17%, థానె 10% తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఎన్సీఆర్ 22%, నవీ ముంబై 4 శాతం విక్రయాలు పెరిగే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. పై 9 నగరాలలో జూలై ? సెప్టెంబర్ నెలలో గృహాల విక్రయాలు 1,04,393 యూనిట్లుగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. గత ఏడాది ఇదే సమయంలో 1,26,848 యూనిట్ల విక్రయాలు జరిగాయి. ఈ ప్రకారం 18 శాతం పతనం అయినట్టు తెలుస్తోంది.హైదరాబాద్ నగరంలో జూలై ? సెప్టెంబర్ నెలలకు సంబంధించి గృహాల విక్రయాలు 12,082 యూనిట్లుగా ఉండొచ్చని తెలుస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి 20,658 యూనిట్ల విక్రయాలు జరిగాయి. దేశంలోని అన్ని నగరాల కంటే హైదరాబాదులోనే గృహాల విక్రయాలలో క్షీణత నమోదయిందని తెలుస్తోంది. అంతకు ముందు ఏడాది హైదరాబాద్ నగరంలో దేశంలోనే ఎక్కువగా ఇళ్ల విక్రయాలు ఇక్కడనే నమోదు కావడం విశేషం. మహానగరాలను కాదని హైదరాబాదులోనే రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోయిందని.. ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా మారిందని భారత రాష్ట్ర సమితి నాయకులు అంటున్నారు.హైడ్రా దూకుడు వల్ల హైదరాబాదులో గృహాల అమ్మకాలలో తగ్గుదల ఏర్పడిందని అంటున్నారు. “ కొందరు అక్రమార్కులు చట్ట విరుద్ధమైన పనులు చేశారు. వారి వల్ల నిర్మాణరంగం పూర్తిగా కుదేలైంది. అక్రమల లే అవుట్ల వల్ల అమాయకులు బలైపోయారని” రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర రంగాల అంటున్నారు..హైడ్రా దూకుడు వల్ల చెరువుల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరూ ఇళ్లను కొనుగోలు చేయడం లేదు.. చాలా దూరం వరకు అపార్ట్మెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేయడం లేదు. ఇండిపెండెంట్ ఇళ్లు, ఓపెన్ ప్లాట్లను కొనడానికి ఎవరూ ఆసక్తి చూపించడం లేదు. పరిస్థితి దారుణంగా ఉందని.. కరోనా కాలంనాటి ఆందోళనలు కనిపిస్తున్నాయని రియల్ ఎస్టేడి వ్యాపారాలు అంటున్నారు. సాధారణంగా దసరా, దీపావళి సమయంలో ఇళ్ల విక్రయాలు జోరుగా ఉంటాయి.. కానీ అలాంటి సంకేతాలు ఇప్పుడు కనిపించడం లేదు.. పేరుపొందిన సంస్థల ఇళ్ల విక్రయాలు కూడా అంతంత మాత్రం గానే ఉన్నాయి. హైడ్రా దూకుడు వల్ల చాలామంది ఒకటికి 20 సార్లు ఆలోచించుకుని ఇళ్లను కొనుగోలు చేస్తున్నారని.. అందులోనూ ప్రీమియం గృహాల జోలికి వెళ్లడం లేదని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు. భూముల ధర కూడా దారుణంగా పతనమైందని.. శివారు ప్రాంతంలో ఒక్కో ప్లాట్ పై నికరంగా 10 లక్షల వరకు విలువ తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. ప్రభుత్వం తమకు శుభవార్త చెబితేనే రియల్ ఎస్టేట్ రంగంలో కాస్త కదలిక వస్తుందని వివరిస్తున్నారు. “రేవంత్ ప్రభుత్వం హైడ్రా పేరుతో వ్యవస్థను తీసుకురావడం మంచిదే. కాకపోతే దీనివల్ల పకడ్బందీగా వ్యాపారం చేసేవారు ఇబ్బంది పడుతున్నారని” రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు.

# హైడ్రాపై బీజేపీ గర్జన...

**హైదరాబాద్ :** రాష్ట్ర రాజధాని నగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులను హడలెత్తిస్తున్న హైడ్రాపై పోరాటానికి బీజేపీ రెడీ అవుతోంది. హైడ్రా దూకుడును అడ్డుకునేందుకు అవసరమైన అన్ని మార్గాలను వినియోగించుకోవాలని భావిస్తోంది బీజేపీ. ఇందుకోసం న్యాయ పోరాటంతోపాటు కేంద్ర ప్రభుత్వ అధికారాలను వాడుకునే విషయమై ప్రణాళిక రచిస్తోంది. ముఖ్యంగా హైడ్రా కూల్చివేతలపై తొలుత బీజేపీలో కొంత గందరగోళం కనిపించింది. కాలక్రమేణా ఆ గందరగోళం ఇప్పుడు తెరమరుగైంది. హైడ్రా పేరిట పెద్దలకో న్యాయం? పేదలకు మరో న్యాయం అనుసరిస్తున్నారని ఆరోపిస్తున్న బీజేపీ నేతలు? ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కాలని నిర్ణయించినట్లు సమాచారం.ఆక్రమణలపై కఠిన వైఖరి ప్రదర్శిస్తూ ప్రభుత్వ భూములు, చెరువులను పరిరక్షిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనకు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తొలుత మద్దతుగా నిలిచారు. ఇక కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఎంఐఎం నేతల ఆక్రమణలను సైతం తొలగించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ వంటివారు హైడ్రా పేరిట అరాచకం చేస్తున్నారని విమర్శించారు. ఐతే ఈ భిన్న వాదనలపై పార్టీలో కొంత గందరగోళం కనిపించగా, ప్రస్తుతం అంతా ఏకాభిప్రాయానికి వస్తున్నట్లు చెబుతున్నారు. తొలుత ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడిన ఎంపీ రఘునందన్‌రావు ఇప్పుడు తన అభిప్రాయం మార్చుకున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో పేదల ఇళ్లనే లక్ష్యంగా చేసుకోవడంపై మండిపడుతోంది బీజేపీ.ఇక ఇదే విషయమై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుందామన్నట్లు సీనియర్ నేత, ఎంపీ ఈటల రాజేందర్ అడుగులు వేస్తున్నారు. హైడ్రా కూల్చివేతలపై మరే నేత చేయని విధంగా నేరుగా బాధితులను కలుస్తూ వారిని ఓదార్చుతున్నారు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను సైతం ఈటల వెనక్కి నెట్టేశా రంటున్నారు. హైడ్రా కూల్చివేతలపై తొలుత ప్రభుత్వానికి మద్దతుగా అన్నివర్గాలు నిలిచినా, క్రమేణా ఆ పరిస్థితిలో మార్పు వస్తోందని భావిస్తోంది బీజేపీ. ప్రధానంగా అన్నిరకాల అనుమతులు చూసి, అప్పులు చేసి ఇల్లు కట్టుకున్న, కొనుకున్న పేద, మధ్యతరగతి వారికే ఎక్కువ నష్టం జరుగు తోందని ఆరోపిస్తోంది బీజేపీ. ఈ విషయంలో పేదలకు అండగా నిలవాలని భావించిన ఈటల రాజేందర్.. హైడ్రా కూల్చివేతలపై కేంద్రానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఇక ఈటలతోపాటు బీజేపీ నేతలు మొత్తం హైడ్రాను టార్గెట్ చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వంపై పోరాడటానికి ఇదే ప్రధాన ఆయుధంగా భావిస్తున్న కమలనాథులు? కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేలా అడుగులు వేసేందుకు రెడీ అవుతున్నట్లు చెబుతున్నారు. మరోవైపు హైడ్రాతో రాజకీయంగా తమనే ప్రయోజనం దక్కుతుందని ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీ? బీజేపీ ప్రచారాన్ని, పోరాటాన్ని ఎలా తిప్పికొడుతుందనేది ఆసక్తికరంగా మారింది.ఏదిఏమైనా రాష్ట్రంలో కాంగ్రెస్, వర్సెస్ బీజేపీ యుద్ధానికి హైడ్రా కారణమవ్వనుందనేది స్పష్టమవుతోంది. మొత్తానికి హైడ్రాతో రాష్ట్రంలో మైలేజ్ పెంచుకోవాలని అధికార కాంగ్రెస్ ప్లాన్ చేయగా, అదే హైడ్రాతో కాంగ్రెస్‌ను దెబ్బతీయాలనే బీజేపీ ప్లాన్ ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా బీజేపీ నేత, ఎంపీ ఈటల స్కెచ్‌తో కాంగ్రెస్ సర్కార్‌పై పైచేయి సాధించేలా అడుగులు వేస్తున్నారు కమలనాథులు. దీంతో ఇక హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్ వర్సెస్ ఎంపీ ఈటలగా మారనుందా? అనేది చూడాల్సివుంది.

## 6 లక్షల ఫోన్ నెంబర్స్,
# 800 యాప్స్ బ్లాక్

**న్యూఢిల్లీ :** ఈజీ మనీ కోసం అలవాటు పడిన స్కామర్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నిలువునా దోచేస్తున్నారు. అందుకే, ప్రభుత్వం సైబర్ నేరాల పై ఉక్కు పాదం మోపింది. ఇప్పటికే, వచ్చిన కంప్లైంట్ మరియు సమాచారాన్ని ఆధారంగా చేసుకొని 6 లక్షలకు పైగా మొబైల్ ఫోన్ లను డీ యాక్టివేట్ చేయడమే కాకుండా 800 పైగా ఫేక్ యాప్స్ బ్లాక్ కూడా చేసింది. వచ్చిన ఫోన్ నెంబర్ నుంచి రాకుండా.. కొత్త కొత్త నెంబర్ల నంచి కాల్ చేస్తూంటారు. ఫెడెక్స్ కొరియల్ అంటారు.. డిజిటల్ అరెస్ట్ అంటారు.. ఏదేదో చెప్పి భయపెట్టి డబ్బులు వసూలు చేస్తూంటారు. ఇక మామూలు మోసగాళ్లకు లెక్కే ఉండదు. ఇలాంటి వారి బారి నుంచి ప్రజల్ని కాపాడటానికి కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. ఎనిమిది వందల ఫ్రాడ్ యాప్స్ తో పాటు.. అరు లక్షల ఫోన్ నెంబర్స్ ను బ్లాక్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇవన్నీ ఫ్రాడ్ చేస్తున్నాయని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నిర్ధారించింది. అలాగే.. అరవై ఐదు వేల వెబ్ సైట్లను కూడా నిషేధించారు సైబర్ నేరాళ్లు తాము ఎవరో గుర్తు పట్టకుండా మోసాలు చేస్తున్నారు.ఇందు కోసం యాప్స్, అడ్రస్ లేని వెబ్ సైట్స్ ను పెట్టుకుని స్కాములకు పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో ప్రజలు వీటి బారిన ఎక్కువగా పడుతున్నారు. ట్రేడ్ మోసాలు, ఇన్వెస్ట్మెంట్ స్కామ్ చివరికి డేటింగ్ పేరుతో కూడా ఫోన్లు చేసి స్కామ్ చేస్తున్నారు. ఇలాంటివేల సంఖ్యలో నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా ఇలాంటి సైబర్ మోసగాళ్ల బారిన పడిన కేసులు పదిహేడు వేలకుపైగా నమోదయ్యాయి. ఇంకా అనేక మంది పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లకుండా పరువు పోతుందని సైలెంట్ గా ఉన్నారు. సైబర్ నేరాలను పూర్తిగా అరికట్టే దిశగా చర్యలు చేపట్టిన మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ సైబర్ నేరాల కోసం తీసుకు వచ్చిన ది ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి) ను రంగంలోకి దించింది.

యాక్షన్ లోకి దిగిన ఐ4సి వింగ్ 6,00,000 లక్షలకు పైగా మొబైల్ ఫోన్ లు మరియు సైబర్ స్కామ్ లకు సహకరిస్తున్నట్లు కనుగొన్న 65,000 లకు పైగా యూఆర్ఎల్ లను కూడా బ్లాక్ చేసింది. ఇది కాకుండా సైబర్ నేరాలకు ఆయువు పట్టుగా ఉన్న 800 పైగా యాప్స్ ను కూడా బ్లాక్ చేసినట్లు, ఒక వార్తా సంస్థ రిపోర్ట్ చేసింది. ఐ4సి వింగ్ ప్రయత్నంతో దేశంలో విచ్చలవిడిగా పెట్రేగి పోతున్న సైబర్ నేరగాళ్ల రెక్కలు విరిచేలా ప్రభుత్వం చేయగలిగింది. సైబర్ నేరగాళ్ల పై చేసిన పోరాటంలో ది నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఔఅఖీఖ) కూడా ప్రధాన పాత్ర పోషించింది. 2023 నుంచి ఈ పోర్టల్ పై 1,00,00 కు పైగా ఇన్వెస్ట్మెంట్ స్కామ్ కంప్లైంట్ లను అందుకుంది.

వీటిలో 20 వేలకు పైగా ట్రేడింగ్ స్కామ్, 62 వేలకు పైగా ఇన్వెస్ట్మెంట్ స్కామ్ కేసులు నమోదు అయ్యాయిసైబర్ నేరగాళ్లను అణచి వేయడానికి కేంద్ర ప్రభుత్వ హోంమంత్రిత్వ శాఖ 2018లోనే ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసింది. సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ డివిజన్ ను ఏర్పాటు చేసి ..సైబర్ క్రైమ్ ను నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకుంది. క్రిటికల్ కేసుల్లో కంట్రోల్ రూమ్లను కూడా ఏర్పాటు చేసి నందితుల్ని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో సాంకేతికంగా అత్యాధునిక శిక్షణ పొందిన వారు ఉంటారు. సైబర్ క్రైమ్స్ ను సహించేది లేదని కేంద్రం ఈ చర్యల ద్వారా స్పష్టం చేస్తున్నట్లు అయింది. నిజానికి ఈ కొత్త ఫోన్ నెంబర్లు, వెబ్ సైట్ల కన్నా.. ముఖ్యంగా డేటా చోరీ అనేది అత్యంత కీలకమైన సమస్యగా మారింది. మన ఫోన్ నెంబర్లు ఆ స్కామర్లు ఎలా తెలుస్తున్నాయి.. మన ఫోన్ నెంబర్లు, ఆధార్ కార్డుల వివరాలు, బ్యాంక్ అకౌంట్లలో ఉన్న నగదు వివరాలు కూడా తెలుసుకుని ఫోన్లు చేస్తున్నారు. మన పార్శిల్ ఏదైనా రావాల్సి ఉంటే.. వెంటనే తెలుసుకుని ఆ పార్శల్ లో డ్రగ్స్ ఉన్నాయని ఆరోపణలు చేస్తూ..భయపెడుతున్నారు. ఈ డేటా చోరీని కూడా కేంద్రం నియంత్రిస్తే.. చాలా వరకూ సైబర్ క్రైమ్స్ ఆగిపోయే అవకాశం ఉంది.

# రమణారెడ్డి... సొంత మ్యానిఫెస్టోతో ఇబ్బందులు

**నిజామాబాద్ :** ఆ నేత గెలుపు గత ఎన్నికల్లో సంచలనం. ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థులను ఓడించి.. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పార్టీ మేనిఫెస్టోతో సంబంధం లేకుండా సొంత స్కీమ్స్ ప్రకటించేశారా ఎమ్మెల్యే. 150 కోట్లు ఖర్చయినా సరే సొంత ఆస్తుల్ని అమ్మి అయినా.. నియోజకవర్గాన్ని నందనవనం చేస్తానని చెప్పారు. మరి, హామీలు అమలు చేశారా? ఆ దిశగా అడుగులు పడ్డాయా? త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యే ఓన్ మ్యానిఫెస్టో ప్రతిపక్షాలకు అస్త్రంగా మారనుందా? బీజేపీ నేత, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి. గత ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఓడించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు రమణారెడ్డి. కానీ గత ఎన్నికల్లో మాత్రం ఇద్దరు ఉద్దండులను కాదని కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఆయనకు తొలిసారి అవకాశం ఇచ్చారు.కాటిపల్లిని ఎమ్మెల్యేగా గెలిపించడం వెనుక.. ఓ కారణం ఉందంటున్నారట నియోజకవర్గ ప్రజలు. ఎన్నికల వేళ ఏ ఎమ్మెల్యే అభ్యర్థి చేయని సాహసం చేశారట రమణారెడ్డి. నన్ను చూసి ఓటెయ్యండి, నా పథకాల్ని చూడండి అంటూ 150 కోట్లతో సొంత మ్యానిఫెస్టో ప్రకటించారట. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా 150 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారట. ప్రజలు సైతం ఆయన మాటలను నమ్మి గెలిపించారు. అయితే ఇప్పుడు 6 నెలల్లో హామీలను అమలు చేస్తానన్న ఎమ్మెల్యే.. 9 నెలలు గడిచిన ఏమి పట్టనట్టు సైలెంట్ గా ఉండడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ.. ఇప్పుడేమయ్యాయని ప్రశ్నలు సైతం వస్తున్నాయి. నియోజకవర్గం మొత్తం ఉచిత కార్పొరేట్ విద్య, వైద్యం.. ఉచిత శిక్షణ కేంద్రాలు, రైతులకు కల్లాల నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు.. జనరల్ ఆసుపత్రులను నిర్మిస్తానని ఎన్నికల హామీలు ఇచ్చారట కాటిపల్లి. 150 కోట్ల రూపాయల సొంత నిధులతో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారట.

తీరా ఇప్పుడు గడిచి ఇన్ని నెలలు అవుతుండడంతో.. ఇంత కాలం ఓపిక పట్టిన ప్రజలు.. ఇప్పుడు ఆ హామీలు సంగతేంటని ప్రశ్నించడానికి రెడీ అవుతున్నారని టాక్ నడుస్తోంది.ఈ పరిస్థితుల్లో సొంత పార్టీ క్యాడర్ సైతం.. కాటిపల్లి ఇచ్చిన హామీలు అమలు చేయడం సాధ్యమేనా అని చర్చించుకుంటున్నారట. నాడు ప్రభుత్వాలు చేసేదేంటి నన్ను గెలిపించండి.. అన్ని నేను చేసి చూపిస్తానన్న ఎమ్మెల్యే.. ఇప్పుడు మిన్నకుండడం పట్ల బీజేపీ నేతలు సైతం అయోమయంలో ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు రానున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో.. 150 కోట్ల మ్యానిఫెస్టోపై ప్రజల నిలదీస్తే ఏం సమాధానం చెప్పాలని తర్జనభర్జన పడుతున్నారట.గత అసెంబ్లీ ఎన్నికల్లో రమణారెడ్డి సొంత మ్యానిఫెస్టో బుక్ లెట్ ను విడుదల చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అదే బుక్ లెట్ తో ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ భావిస్తున్నట్టు సమాచారం అందుతోంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రభుత్వం పై కాటిపల్లి విమర్శలు చేస్తే.. సెల్ఫ్ మ్యానిఫెస్టోను అంశంపై ప్రశ్నలు సంధించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆస్తులు అమ్మైనా మ్యానిఫెస్టోను అమలు చేస్తామని చెప్పి.. ఇప్పుడు ఏం చేశారని అధికార పక్షం సైతం నిలదీస్తారని మౌనం వహిస్తున్నారట.త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికలను వేదికగా చేసుకుని బీజేపీని నిలదీయాలని.. కాంగ్రెస్ నేతలతో పాటు ప్రజలు సైతం సమాయత్తం అవుతున్నారని నియోజకవర్గం వ్యాప్తంగా జోరుగా చర్చ నడుస్తోంది.
ఎమ్మెల్యే కాటిపల్లిని ప్రశ్నించేందుకు రైతులు, విద్యార్థులు, యువత, ప్రజలు సిద్ధమవుతున్నారట. దీనిపై కాటిపల్లి, బీజేపీ నేతలు ఏం సమాధానం చెబుతారో అనేది సస్పెన్స్ గా మారింది.అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి చేసిన కామెంట్లతో కామారెడ్డి ప్రజలు అవాక్కవుతున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అసలు రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అనిపిస్తుందని .. రమణారెడ్డి వైరాగ్యంతో మాట్లాడడం పట్ల ప్రజలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తమ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తారని నమ్మి.. ఎమ్మెల్యే పదవి కట్టబెడితే ఇలా మాట్లాడడం ఏంటని షాక్ అవుతున్నారట.మొత్తానికి సెల్ఫ్ మ్యానిఫెస్టోతో గ్రాండ్ విక్టరీ కొట్టిన కాటిపల్లి.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తారా ? ఎమ్మెల్యే మౌనం రానున్న ఎన్నికల్లో బీజేపీకి కష్టాలు తెచ్చిపెడుతుందా ? ఎమ్మెల్యే వ్యవహార శైలిపై ప్రజలు భగ్గుమనే టైం దగ్గర పడిందా అనే ప్రశ్నలు ప్రస్తుతం ఆసక్తిగా మారింది.

# 28, 29 తేదీలలో తల్లిపాలపై అంతర్జాతీయ సదస్సు

**హైదరాబాద్** తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈనెల 28, 29 తేదీలలో నగరంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ వైద్య కమిషన్ సభ్యుడు డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఇఃదుకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. 29న అమీర్పేటలోని మ్యారిగోల్డ్ జరిగే అంతర్జాతీయ సదస్సు ను జాతీయ మెడికల్ కమిషన్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ బి.ఎన్ గంగాధర్, ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. ఈ సదస్సులో సుమారు 1000 మందికి పైన వైద్యులు హాజరవుతారని అన్నారు.

# తిరుమల లడ్డూ... మారింది...

**తిరుమల :** తిరుమల లడ్డు మారింది. నెయ్యిలో నాణ్యత లడ్డుతో పాటు శ్రీవారి అన్న ప్రసాదాల రుచిని మార్చింది. నెయ్యి కల్తీతో లడ్డు ప్రసాదం అపవిత్రం అయిందన్న దుమారం భక్తుల్లో ఆందోళనకు గురి చేయడంతో తిరుమల తిరుపతి దేవస్థానం అలెర్ట్ అయ్యింది. శ్రీవారి మహా ప్రసాదంలో క్వాలిటీని పెంచింది. వెంకన్న ప్రసాదం మహా అద్భుతంగా ఉందన్న సంతృప్తిని కలిగించింది.తిరుమల లడ్డు.. మహా ప్రసాదంగా కోట్లాది మంది భక్తులు స్వీకరించే లడ్డూ రుచి ఎంతో మాధుర్యం. 310 ఏళ్లు నిండిన ఆ లడ్డు మాధుర్యం ఈ మధ్య కల్తీ నెయ్యితో రుచితప్పిందన్న భావన భక్తుల్లో బలంగా వినిపించింది. అమృత పదార్థంగా భక్తిరస మాధుర్యాన్ని పంచుతున్న తిరుమల వెంకన్న లడ్డూ లోని నెయ్యి కల్తీ వ్యవహారమే ఇందుకు కారణం అయ్యింది. తిరుమల శ్రీవారి భక్తులకు ఎంతో ఇష్టమైన లడ్డూ ప్రసాదంలో నాణ్యత లేకపోవడానికి నెయ్యి నే కారణమని తేలింది. దీంతో నెయ్యి నాణ్యతను పెంచడం ద్వారా మహా ప్రసాదంలో క్వాలిటీ తీసుకురావాలని టీటీడీ భావించింది. ఈ చర్యనే కాంట్రవర్సీ కారణం అయ్యిందివెంకన్న భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డు ప్రసాదం నాణ్యత పై భక్తుల నుంచి వస్తున్న విమర్శలకు చెక్ పెట్టే ప్రయత్నం చేసింది. శ్రీవారి దర్శనానికి ఎంత ప్రాధాన్యతనిస్తారో అంతే ప్రాధాన్యత ఇస్తున్న శ్రీవారి లడ్డు ప్రసాదం మహా ప్రసాదంగా భక్తులు భావించేలా చర్యలు చేపట్టింది. లడ్డు నాణ్యతపై భక్తుల నుంచి పిర్యాదులు, విమర్శలకు టీటీడీ చెక్ పెట్టే ప్రయత్నంలో సక్సెస్ అయింది. తిరుమలలో ప్రక్షాళన షురూ చేసిన సర్కార్ లడ్డు తయారీలో నాణ్యతకు పెద్ద పీట వేసింది. లడ్డు తయారీ కి వినియోగించే నెయ్యిలో నాణ్యత లేదని పోటు సిబ్బంది కూడా ఈవో దృష్టికి తీసుకుని రావడంతో నెయ్యి సరఫరా మారింది. నాణ్యత పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టిన టీటీడీ సమూల మార్పులు చేసింది. లడ్డు తయారీకి వినియోగించే ముడి సరుకులలో నాణ్యత తోపాటు స్వచ్ఛమైన నెయ్యి ని కొనుగోలు చేస్తోంది. లడ్డు రుచి, నాణ్యత ను నందిని నెయ్యితో పెంచింది. ఇలా తిరుమల లడ్డు, శ్రీవారి అన్న ప్రసాదాలు నాణ్యత, రుచి పై టీటీడీ మరింత ఫోకస్ పెట్టింది.కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నెయ్యితో శ్రీవారి లడ్డు ప్రసాదాల్లో క్వాలిటీ పెంచిన టీటీడీ.. 10 లక్షల కేజీల నందిని నెయ్యి కొనుగోలుకు కేఎంఎఫ్ కు ఆర్డర్ ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం కర్ణాటక నుంచి తిరుపతికి నందిని నెయ్యి ట్యాంకర్ల ద్వారా చేరుతోంది. ఇలా భక్తకోటికి అమృత పదార్థంగా భక్తి రసం ఆధ్వర్యంలో పంచుతున్న తిరుమల వెంకన్న లడ్డు కు దాదాపు 310 ఏళ్ల చరిత్ర ఉంది. 1715 లో తిరుమలేశుడికి శ్రీవారి ప్రసాదం అందుబాటులోకి రాగా 15వ శతాబ్దం నుంచే శ్రీవారి ప్రసాదం వడ భక్తుల కడుపు నింపేది. ఇలా శ్రీహరి ప్రసాదానికి ఎంతో ప్రాధాన్యత ఉండగా భక్తకోటికి ప్రీతిపాత్రమైన లడ్డూ నైవేద్యమంటే తిరుమలేశునికీ కూడా ఎంతో ఇష్టమైనది.ఇలా శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని 1803లో అప్పటి మద్రాసు ప్రభుత్వం తొలిసారిగా ఆలయంలో బూందీ ప్రసాదాన్ని ఇవ్వడం ప్రారంభించింది. ఇదో చారిత్రక ఆధారం కాగా అప్పటి నుంచే ప్రసాదాలు కూడా విక్రయించే వారన్న ప్రచారం ఉంది. పల్లవుల కాలం నుంచే ప్రసాదాల పరంపర మొదలయ్యిందని చరిత్ర చెబుతోంది. అప్పట్లోనే శ్రీవారికి సంధి నివేదనలు గా నైవేద్య వేళలు ఖరారు కాగా ఈ సమయాల్లోనే భక్తులకు ప్రసాదాలు పంచేవారనీ తెలుస్తోంది. ఆ రోజుల్లో కొండమీద భోజన సదుపాయం లేకపోవడంతో ప్రసాదాలే భక్తుల ఆకలి తీర్చేవన్న ప్రచారం కూడా ఉండగా భక్తులకు అందజేసే ప్రసాదాన్ని తిరుప్పొంగం ఆ తర్వాత సుఖీయం మనోహరపడి ఇలా ప్రసాదాలను ప్రవేశ పెట్టారు. వీటిలో వడ తప్ప మరేవీ ఎక్కువ రోజులు నిల్వ ఉండేవి కాక పోవడంతో వడకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది.ఇక, 1940 నుంచే భక్తుల చేతికి లడ్డూ అందింది. 1933లో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటైన తరువాత ఆలయంలో ప్రసాదాల వితరణ, విక్రయ కార్యక్రమాలను పెంచగా 1940 నుంచి బూందీని లడ్డుగా మార్చి భక్తులకు అందజేయడం అమల్లోకి వచ్చింది. లడ్డూల తయారీకి వాడాల్సిన సరుకుల మోతాదును దిట్టం అనే పేరుతో 1950లో తొలిసారిగా టీటీడీ ధర్మకర్తల మండలి ఖరారు చేసింది. దిట్టం పరిమాణాలను ఖరారు చేసిన టిటిడి ఆలయ అవసరాలతోపాటు పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా దిట్టాన్ని పెంచుతూ వస్తోంది. 2001లో సవరించిన దిట్టాన్ని అనుసరిస్తున్న టిటిడి లడ్డు ప్రసాదాన్ని తయారు చేస్తుంది. భక్తులకు మాధుర్యాన్ని అందించే లడ్డూ తయారీ కోసం చిన్న లడ్డూకు రూ. 48 వరకు ఖర్చు చేస్తున్న టీటీడీ రూ. 50 లకు విక్రయిస్తోంది.ఇక పోటులో దిట్టం ప్రకారం 5100 లడ్డూలు తయారు చేయడానికి మొత్తం 803 కేజీల ముడి సరుకును వినియోగిస్తున్న టీటీడీ ఆవు నెయ్యి 165 కేజీలు, శెనగపిండి 180 కేజీలు, చక్కెర 400 కేజీలు, ముంత మామిడిపప్పు 30 కేజీలు, ఎండుద్రాక్ష 18 కేజీలు, కలకండ 8 కేజీలు, యాలకులు 4 కిలోలు వినియోగిస్తోంది. టీటీడీ తయారు చేసే లడ్డూ మరెక్కడా తయారు చేయకుండా పేటెంట్ హక్కులు కూడా దక్కించుకుంది. భక్తులకు అందజేసే ఉచిత లడ్డు కాకుండా మూడు రకాల లడ్డూలను టిటిడి తయారు చేస్తోంది. రోజూ దాదాపు 15 మెట్రిక్ టన్నుల నెయ్యిని వినియోగిస్తూ మూడు నుంచి మూడున్నర లక్షల లడ్డూలను తయారు చేస్తున్న పోటులో 600 మందిని సిబ్బంది గుమ గుమలాడే లడ్డు ప్రసాదాన్ని తయారు చేస్తోంది. 100 మంది కాంట్రాక్ట్ సిబ్బంది మరో 500 మంది శ్రీవైష్ణవులు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని, శ్రీవారికి నైవేద్యాలను సాంప్రదాయబద్ధంగా తయారు చేస్తున్నారు. ఇలా ఇప్పుడు లడ్డులో నాణ్యతను పెంచిన టిటిడి క్వాలిటీ నెయ్యి వాడటం లేదన్న ఆరోపణలకు చెక్ పెట్టింది.ఈ టెండరింగ్ ద్వారా స్వచ్ఛమైన నెయ్యిని ప్రొక్యూర్ చేసుకుంటున్న టీటీడీ ఏటా 5 వేలకు పైగా మెట్రిక్ టన్నుల నెయ్యిని వినియోగిస్తుంది. దీంతో లడ్డు తయారీలో నాణ్యతను పెంచిన టిటిడి ప్రతి నెల 1.10 కోట్ల లడ్డూలను భక్తులకు విక్రయిస్తోంది. ఏటా రూ 500 కోట్ల ఆదాయాన్ని గడిస్తోంది. దీంతో తిరుమల లడ్డూ ఎవర్గ్రీన్ అన్నట్లు కల్తీ వివాదానికి చెక్ పెట్టేలా నాణ్యతను పెంచడమే కాదు వెంకన్నను దర్శించుకున్న భక్తులకు అడిగినన్ని లడ్డూలను అందుబాటులోకి తెచ్చింది. స్వచ్ఛమైన నెయ్యితో తయారవుతున్న లడ్డుకు మరింత ప్రాశస్త్యాన్ని తీసుకురా గలిగింది. లడ్డూలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు కలిపారనే వ్యాఖ్యలపై చెలరేగిన దుమారం భక్తులపై పడకుండా స్వచ్ఛమైన నేతి వాడకంతో శ్రీవారి మహా ప్రసాదం గుమగుమలాడేలా చేసింది. నిత్యం శ్రీవారిని సగటు రోజూ దర్శించుకునే 70 వేల మందికి పైగా భక్తుల మన్ననలు టీటీడీ పొందుతోంది. రోజువారీగా లడ్డూను కొనుగోలు చేస్తున్న భక్తకోటి నాణ్యత పెరిగిందన్న సంతృప్తిని వ్యక్తం చేస్తోంది.ఒకవైపు తిరుమల లడ్డూ పై కల్తీ వివాదం నడుస్తుండగానే లడ్డూకు డిమాండ్ మాత్రం కొనసాగుతోంది. లడ్డూలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు కలిపారనే వ్యాఖ్యలపై చెలరేగిన దుమారం ప్రపంచ వ్యాప్తం గా చర్చకు దారితీసినా ప్రతిరోజూ దర్శనం కోసం వచ్చే కొండకు వచ్చే భక్తులు పెరుగుతున్నట్లే లడ్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఎప్పటిలాగే లడ్డూను కొనుగోలు భక్తుల రద్దీ కంటిన్యూ అవుతోంది. గత నాలుగు రోజుల్లో 14 లక్షలకు పైగా తిరుపతి లడ్డూలు భక్తులకు చేరాయి. సెప్టెంబర్ 19న 3.59 లక్షల లడ్డూలను విక్రయించి నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఇక సెప్టెంబర్ 20న 3.17 లక్షలు, 21న 3.67 లక్షలు, 22న 3.60 లక్షల లడ్డూలు అమ్మకాలు జరిగాయి. ఇలా టీటీడీ గణాంకాలు ప్రకారం రోజువారీ సగటున దాదాపు 3.50 లక్షల లడ్డూలను భక్తులకు టీటీడీ విక్రస్తోంది. కల్తీ నెయ్యి వివాదం ఉన్నా ప్రస్తుతం స్వచ్ఛమైన నెయ్యితో తయారవుతున్న లడ్డూల అమ్మకాలపై ఎలాంటి ప్రభావం చూపలేదన్న అభిప్రాయం భక్తుల కొనుగోలు స్పష్టం చేస్తోంది.



# జెత్వానీ కేసులో సజ్జల బుక్కైనట్టేనా

**విజయవాడ :** హీరోయిన్ జెత్వానీ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులు నిండా మునిగిపోయే పరిస్థితి వచ్చింది. పరారీలో ఉన్న ఏ వన్ కుక్కల విద్యాసాగర్ ను పోలీసులు డెహ్రాడూన్‌లో పట్టుకుని విజయవాడకు తీసుకు వచ్చి రిమాండ్ కు తరలించారు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు. కుక్కల విద్యాసాగర్ తో కలిసి ఐపీఎస్‌లు కుట్ర పన్ని జెత్వానీపై తప్పుడు కేసులు పెట్టారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా ఎఫ్ఐఆర్లో ఆ ముగ్గురి పేర్లు చేర్చినప్పటికీ వారి మెడకు ఉచ్చ బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే విద్యాసాగర్ కోసం ఆ ఐపీఎస్‌లు ఇదంతా చేయలేదని.. అప్పటి ప్రభుత్వ ముఖ్యసలహాదారు సజ్జల ప్రమేయంతోనే ఈ తతంగమంతా నడిచిందంటున్నారు.ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను డెహ్రాడూన్ నుంచి రైలులో అర్ధరాత్రి తీసుకొచ్చిన పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలోనే పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌ని కోర్టుకు సమర్పించారు. ఆ రిపోర్ట్లో సీనియర్ ఐపీఎస్ అధికారులు పి.సీతారామాంజనేయులు , కాంతిరాణా తాతా, విశాల్ గున్నీని నిందితులుగా చేర్చారు.వారితో పాటు అప్పట్లో విజయవాడ వెస్ట్‌జోన్ ఏసీపీగా పనిచేసిన హనుమంతురావు, ఇబ్రహీంపట్నం సీఐగా ఉన్న సత్యనారాయణలను కూడా నిందితులుగా చేర్చారు. విద్యాసాగర్‌తో అధికారులు కుమ్మక్కైనట్లు రిమాండ్ రిపోర్ట్లో వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ ఐదుగురిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.. అయితే ఎఫ్ఐఆర్‌లో ఇంకా సీతారామాంజనేయులు , కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ పేర్లు చేర్చలేదు. నేడో, రేపో ఆ ముగ్గురి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చి అరెస్టులు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.అరెస్టు భయంతో ఐపీఎస్ అధికారి కాంతిరాణా టాటా ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నారు. తనపై తప్పుడు కేసు పెట్టారని.. తాను జెత్వానీ విషయంలో నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించానని కాంతి రాణా టాటా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, విశాల్ గున్నీ ఇంకా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోలేదు.పి.సీతారామాంజనేయులు, కాంతి రాణా, విశాల్‌గున్నీ వై నేత కుక్కల విద్యాసాగర్‌తో కుమ్మక్కై కాదంబరీ జెత్వానీని అక్రమంగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్ట్లో పేర్కొన్నారు. మరోవైపు కుక్కల విద్యాసాగర్‌కు వచ్చే నెల 4 వరకు జడ్జి రిమాండ్ విధించగా విజయవాడ సబ్ జైలుకు తరలించారు. అతడిని పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ కేసులో పలు నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్న నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ముంబైకి చెందిన కాదంబరి జెత్వానీని గత ఫిబ్రవరిలో పోలీసులు అరెస్టు చేశారు. ఓ హీరోయిన్ ను అరెస్టు చేసి తీసుకు వచ్చినా ఎవరికీ తెలియదు. అత్యంత రహస్యంగా అరెస్టు చేసి తీసుకు వచ్చారు. దాదాపుగా నెలన్నర పాటు ఆమెను రిమాండ్ లో ఉంచారు. ఈ లోపు ముంబైలో ఆమె పారిశ్రామిక వేత్త జిందాల్‌పై పెట్టిన కేసులో.. పోలీసుల ఎదుట హాజరు కాలేకపోవడంతో ఆ కేసును కొట్టి వేశారు. ఇందు కోసమే ఆమెను అరెస్టు చేశారని.. జిందాల్‌ను రక్షించడం కోసం.. ఇదంతా చేశారన్న ఆరోపణలను జెత్వానీ చేస్తున్నారు. తనను అక్రమ కేసులో అరెస్టు చేసి వేధించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.జెత్వానీపై కేసు నమోదు చేయడానికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. తనకు తప్పుడు పత్రాలతో భూమి అమ్మారని కుక్కల విద్యాసాగర్ అప్పట్లో చేసిన ఫిర్యాదు మేరకు ఆమెను అప్పట్లో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అసలు జెత్వానీ ఎవరికీ భూమి అమ్మకానికి పెట్టలేదని.. ఎవరికీ ఆమె డబ్బులివ్వలేదని తాజా విచారణలో తేలింది. ఆమెపై ఫిర్యాదులో కుక్కల విద్యాసాగర్ పేర్కొన్న వ్యక్తులే ఈ విషయాన్ని విచారణాధికారులకు చెప్పారు. తమకు జెత్వానీతో ఎలాంటి పరిచయం లేదని ఆమె .. స్థలం అమ్మజూపలేదని స్పష్టం చేశారు. ఇలా జెత్వానీపై తప్పుడు కేసు పెట్టడం కోసమే అందరూ కలిసి ఓ ముఠాగా ఏర్పడి వేధించారని తేలడంతో.. కేసులు పెట్టారు.

అయితే జెత్వానీ లాంటి సెలబ్రిటీపై విద్యాసాగర్ కేసు పెట్టడం.. దానికి ఐపీఎస్‌లు సహకరించడం వెనుక అప్పటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సలహాదారు సజ్జల రామక?ష్ణారెడ్డి పేరు ప్రధానంగా ఫోకస్ అవుతోంది. ముంబై పారిశ్రామికవేత్త జిందాల్ కోసం జగన్ ఆదేశాల మేరకే సజ్జల కాదంబరీ విషయంలో చక్రం తిప్పారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేసులో సమగ్ర విచారణ పూర్తైతే ముగ్గురు ఐపీఎస్‌లతో పాటు సజ్జల కూడా జైలు పాలు కావడం ఖాయమంటున్నారు. ఆ భయంతోనే సజ్జల అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారన్న టాక్ వినిపిస్తుంది.

# తమ్ముళ్లు వర్సెస్ సైనికులు...

**ఒంగోలు :** ఏపీలోని ఆ జిల్లాలో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పీక్స్ కి చేరిందనే చెప్పవచ్చు. ఛోటా మోటా నాయకుల మధ్య రాజకీయ వేడి రాజుకోగా.. అది చిన్నగా టీడీపీ వర్సెస్ జనసేనగా మారబోతున్న పరిస్థితి ప్రస్తుతం ఈ జిల్లాలో కనిపిస్తోంది. ఇంతకు ఈ జిల్లా రాజకీయ సెగ రాష్ట్ర రాజకీయాలను తాకనుందా.. లేకుంటే వేడి చల్లారేనా అనేదే తేలాల్సి ఉంది.

ఏపీలోని ప్రకాశం జిల్లా రాజకీయం రూటే సపరేట్. అందుకే ఈ జిల్లాలోని రాజకీయ ప్రకంపనల తాకిడి రాష్ట్ర రాజకీయాలను తాకుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అయితే టీడీపీ కూటమి గెలిచిన తరువాత.. ప్రకాశం జిల్లాలో కూడా వైసీపీ హవా పూర్తిగా తగ్గిందని చెప్పవచ్చు. ఓ వైపు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్ ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఒంగోలులో పట్టు సాధించే దిశగా.. అడుగులు వేస్తున్నారు. మరోవైపు వైసీపీ పెద్దన్నగా పేరుగాంచిన ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అనూహ్యంగా జనసేన వైపు మొగ్గు చూపారు. ఈ దశలోనే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ను ఇటీవల బాలినేని కలిశారు. ఇక్కడే ఒంగోలు పొలిటికల్ రౌండప్ ఒక్కసారిగా మారింది.బాలినేని జనసేనలో చేరేందుకు పవన్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. ఒంగోలు టీడీపీ నేతలు ఒక్కసారిగా నిరసన గళమెత్తారు. టీడీపీ కూటమిలో భాగమైన జనసేనలో బాలినేని చేరికను తాము స్వాగతించేది లేదని టీడీపీ నేతలు బాహాటంగానే తమ అభిప్రాయం వ్యక్తపరిచారు.

ఎమ్మెల్యే దామచర్ల సైతం.. బాలినేని అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని, అలాగే అవినీతికి పాల్పడ్డారని, జనసేనలో చేరినా తాము వదిలే ప్రసక్తే లేదంటూ స్పందించారు.ఇలా టీడీపీ విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో బాలినేని సైతం తాను పవన్ కి ఫిర్యాదు చేస్తానని, తాను ఎప్పుడూ వేధింపులకు పాల్పడలేదంటూ ప్రకటించారు. ఈ సమయంలోనే ఒంగోలులో బాలినేని అనుచరులు జనసేన పార్టీ ప్లెక్సీలను ఏర్పాటు చేసి, అందులో బాలినేనికి స్వాగతం అంటూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల ఫోటోలను ఏర్పాటు చేశారు.

అసలే బాలినేని ? దామచర్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితి ఉండగా.. ఈ ప్లెక్సీలు అగ్నికి ఆజ్యం పోశాయని చెప్పవచ్చు.దీనితో ప్లెక్సీలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు తెలుగు తమ్ముళ్ళు. అలాగే అపరచిత వ్యక్తులు బాలినేని ప్లెక్సీలను చించివేశారు. ఇక బాలినేని, ఆయన అనుచరులు సైతం తాము కూడా తగ్గేదేలేదంటూ.. ఇక రివర్స్ రాజకీయాలకు సిద్ధమవుతున్నారట. ఇది ఇలా ఉంటే జనసేన పార్టీలో చేరుతున్న బాలినేనికి జిల్లా జనసేన నాయకులు సైతం మద్దతు పలికారు.ఇదే ఇప్పుడు టీడీపీ కూటమికి పెద్ద తలనొప్పిగా మారిందట.

బాలినేనికి పవన్ కి మధ్య స్నేహబంధం జనసేన వైపు బాలినేనిని లాగితే.. టీడీపీ అధిష్టానం ఇంతకు ఈ విషయంలో ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. ఒంగోలు టీడీపీ నాయకులకు గప్ చుప్ అంటూ సూచిస్తుందా.. లేక బాలినేని చేరికకు టీడీపీ అడ్డు తగులుతుందా అనేది తేలాల్సి ఉంది.

# విజయనగరంలో వాల్మీకి రీసెర్చి సెంటర్

**విజయనగరం :** ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా విజయనగరం జిల్లాలో మొట్టమొదటి వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ప్రారంభం కానుంది. ఈనెల 27న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించనున్నారు. ఉత్తరాంధ్ర అయోధ్యగా పిలిచే రామనారాయణంలో ఏర్పాటు చేస్తున్న వాల్మీకి రిసెర్చ్ సెంటర్‌ను జాతీయ సంస్కృత యూనివర్శిటి తో అనుసంధానం చేశారు నిర్వాహకులు. ఈ వాల్మీకి రిసెర్చ్ సెంటర్ టిటిడి సంస్కృత యూనివర్శిటి పర్యవేక్షణలో సాగుతుంది. ఇక్కడ టిటిడి సంస్కృత యూనివర్శిటికి చెందిన అధ్యాపకులు నిరంతరం అందుబాటులో ఉంటారు. ఈ రీసెర్చ్ సెంటర్ లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృతంకు చెందిన నాలుగు భాషల రామాయణ గ్రంధాలు, రచనలు, పాఠ్యపుస్తకాలతో పాటు శ్రీరామునికి చెందిన ఇతర పుస్తకాలు కూడా అందుబాటులో ఉంటాయి. దేశవిదేశాల్లో రామాయణం పై అధ్యయనం చేసే ఆసక్తి ఉన్నవారెవరైనా ఇక్కడ రీసెర్చ్ చేయవచ్చు. రామాయణంలోని నైతిక విలువలతో కూడిన పలురకాల శ్రీరాముని రూపాలు ఇక్కడ రీసెర్చ్ చేసే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి.రామాయణంపై అనేక మంది అనేక రకాల రామాయణాలు రచించినప్పటికీ వాల్మీకి రామాయణం ప్రధానమైనది. కాగా ఇప్పటివరకు వాల్మీకి రామాయణం పై అధ్యయనం చేసేందుకు ఎక్కడ కూడా రిసెర్చ్ సెంటర్ లేదు. అయితే ఇప్పుడు విజయనగరం రామనారాయణం లో వాల్మీకి రిసెర్చ్ సెంటర్ ప్రారంభం కానుండటంతో రామభక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అధ్యయనం చేసే విద్యార్థులకు రామనారాయణంలోనే ప్రత్యేకమైన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు నిర్వాహకులు. ధనస్సు ఆకారంలో నిర్మితమైన రామనారాయణంను ఉత్తరాంధ్ర అయోధ్యగా పిలుస్తారు. రామనారాయణంలో భావితరాలకు నైతిక విలువలు అందించేలా రామాయణంలోని పలు ఘట్టాలను రూపొందించి అందుబాటులో ఉంచారు. రామనారాయణంలోని అపురూప ఘట్టాలను, లేజర్ షో ను నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి తిలకిస్తుంటారు. రామనారాయణంలో ఇప్పటికే టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న వేద పాఠశాల కూడా ఉంది. ఇప్పుడు రిసెర్చ్ సెంటర్ తో రామనారాయణ ప్రాముఖ్యత మరింత పెరగనుంది.వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఈ నెల 27, 28, 29వ తేదీల్లో రామాయణం పై నాలుగు భాషల్లో మహా సదస్సు కూడా ప్రపంచంలోనే మొట్టమొదటిసారి జరగనుంది. ఈ మహా సదస్సుకు దేశ విదేశాల్లోనే ప్రముఖ పండితులు, పీఠాధిపతులు తరలివచ్చి శ్రీరామునికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారు. భారీగా జరగనున్న ఈ కార్యక్రమానికి వైదిక్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు తరలిరానున్నారు. శ్రీరాముని జీవిత చరిత్రను థీమ్ పార్క్ రూపంలో రూపొందించి భావితరాలకు నైతిక విలువలను అందించాలని దృక్పథంతో నారాయణం నరసింహమూర్తి ఈ రామనారాయణంను ప్రారంభించారు.ప్రస్తుతం వాల్మీకి రిసెర్చ్ సెంటర్ రామనారాయణంలో ప్రారంభించడం తమ అదృష్టమని, భవిష్యత్తులో మరిన్ని శ్రీరామునికి సంబంధించిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శ్రీకారం చుడతామని రామనారాయణం సిఇవో నారాయణం నీరజాశ్రీనివాస్ పేర్కొన్నారు.

# ధర్మవరంలో మళ్లీ ఫ్యాక్షన్ ..

**అనంతపురం :** ఉమ్మడి అనంతపురం జిల్లా అంటేనే ఫ్యాషన్ కు పెట్టింది పేరు. గత రెండు దశాబ్దాల క్రితం అనంతపురం జిల్లాలోని కొన్ని గ్రామాలలో ఫ్యాక్షన్ గొడవలు తారాస్థాయిలో ఉండేవి. ప్రధానంగా ధర్మవరం పెనుగొండ రాప్తాడు తాడిపత్రి నియోజకవర్గాల్లో ఈ ఫ్యాక్షన్ అధికంగా కనిపించింది. రాను రాను ఈ ఫ్యాక్షన్ కాస్త రాజకీయంగా మలుపు తిరగడం జరిగాయి. ఫ్యాక్షన్ నేతలు అందరూ కూడా వారికి నచ్చిన పార్టీలో చేరి పార్టీ జెండాను చేతపట్టి ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగారు. అయినప్పటికీ ఫ్యాషన్ మూలాలు ఉన్న నేతలు దాని నుంచి బయటపడలేక పోయారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ఫ్యాక్షన్ నేతలదే ఆధిపత్యం చెలాయించేవారు. ఇలా ఫ్యాక్షన్ కత్తికి బలైన బడా నేతలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలామంది ఉన్నారు. ఇప్పటికీ అక్కడక్కడ ఫ్యాక్షన్ కు సంబంధించి కక్షలు కార్పణ్యాలతో రగిలిపోతూనే ఉన్నారంటే అర్థం చేసుకోవచ్చు జిల్లాలోని పరిస్థితి ఏ విధంగా ఉందో. ఫ్యాక్షన్ నేపథ్యమున్న ధర్మవరం నియోజకవర్గం ప్రత్యేకమైన స్థానం ఉంది. ధర్మవరం చాలా సెన్సిటివ్ ఏరియా ఇక్కడ పనిచేయాలంటే పోలీసులకు కూడా కత్తి మీద స్వాముల ఉంటుంది ఎప్పుడు ఎక్కడ ఏ ఫ్యాక్షన్ గొడవ జరుగుతుందో తెలియని పరిస్థితి. అలాంటి నియోజకవర్గంలో నిన్నటి రోజు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తన అనుచరుడిని సబ్ జైల్లో పలకరించేందుకు వెళ్లిన సమయంలో జైలు బయట చిన్న వివాదం చోటు చేసుకుంది. బిజెపి నేతలు, వెంకటరామిరెడ్డి డ్రైవర్ మధ్య జరిగిన ఈ గొడవ కాస్త ఉద్రిక్త పరిస్థితులకు తీసింది. దీనిపైన స్పందించిన మాజీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనంగా మారాయి.గత ఐదు సంవత్సరాలలో ఒక్క ఫ్యాక్షన్ మర్డర్ కానీ ధర్మవరంలో జరగకుండా చూశానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఎక్కడ కూడా శాంతి భద్రతలు దెబ్బతినకుండా ధర్మవరం నియోజకవర్గంలోని ప్రజలను తన కార్యకర్తలను అనునిత్యం చూసుకున్నానని వెల్లడించారు. కానీ మా కార్యకర్తలను అలా సైలెంట్ గా ఉండమని చెప్పి నేను తప్పు చేశానని అందుకుగాను కార్యకర్తలు నన్ను క్షమించాలని కేతరెడ్డి వెంకటరామిరెడ్డి వేడుకున్నారు. మనం అధికారంలో ఉన్నప్పుడు వారందరినీ నిలువరించి ఉంటే ఈ రోజు మనకు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశాడు. ధర్మవరం నియోజకవర్గంలో కొత్త రాజకీయ పోకడలకు దారితీస్తుందని ఇది సరైనది కాదన్నారు. 2004 ముందు వరకు ఫ్యాక్షన్ గొడవలతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని బిక్కు బిక్కు మంటూ ఉండే ప్రజలకు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫ్యాక్షన్ లేకుండా చేశారని గుర్తు చేశారు. అనంతరం మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మరొకసారి ఫ్యాక్షన్ వైపు తీసుకెళ్తున్నారని వెల్లడించారు. పది రూపాయలకు కూడా మర్డర్ చేసిన వ్యక్తులు ఇక్కడ ఉన్నారు.లెక్కలు నాకు తెలుసు అందరి లెక్కలు నేను సరి చేస్తా అని గట్టిగా విమర్శించారు. సబ్ జైలు పోలీస్ స్టేషన్ వంద అడుగుల దూరం కూడా లేనప్పటికీ రెండు గంటల పాటు పోలీసులు కూడా అటువైపు రాలేదని విమర్శించారు. ధర్మవరం నుంచి ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొట్టేందుకు 18 సంవత్సరాల టైం పట్టిందని మరి ప్రస్తుతం అదే విధంగా ఫ్యాక్షన్ ప్రేరేపించే విధంగా గొడవలు జరుగుతున్నాయని వీటిని సహించే ప్రసక్తే లేదని కేతరెడ్డి వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు

# జగన్‌కు దూరంగా ధర్మాన...

**శ్రీకాకుళం :** రాజకీయ యవనికపై అతడో అధ్యాయం. జిల్లా రాజకీయాలను ఔపోషన పట్టిన కురువృద్ధుడు. ఒకరకంగా చెప్పాలంటే.. నడుస్తున్న రాజకీయ లైబ్రరీ. అత్యంత పటిష్టమైన వ్యూహాలు, అద్భుతమైన ప్రణాళికలు రచించగల సమర్థుడు. దివంగత వైఎస్ఆర్ హయాంలో శ్రీకాకుళంతో పాటు ఉత్తరాంధ్ర రాజకీయాలు అతని చుట్టూ తిరిగేవి. టీడీపీకి కంచుకోటలాంటి శ్రీకాకుళం జిల్లాలో..కాంగ్రెస్ ప్రభంజనం సాగింది అంటే.. అది ధర్మాన వ్యూహరచన, సోషల్ ఇంజినీరింగ్ వల్లే. ప్రస్తుత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు.రామా రావు, దివంగత మాజీ ఎమ్మెల్యే జుత్తు. జగన్నాయకులు వంటి బలహీనవర్గాలకు చెందిన నాయకులు.. ఎమ్మెల్యే టిక్కెట్లు సాధించటం వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. 2009లో పది సీట్లకు గాను.. తొమ్మిది సీట్లు గెలుచుకుని..కాంగ్రెస్ సత్తా చాటింది. కానీ కాలం గిర్రున తిరిగింది. వైఎస్ఆర్ దివికేగారు. తదనంతర పరిస్థితుల నేపథ్యంలో ప్రసాదరావు.. జగన్తో కలిసి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. వాస్తవానికి అప్పుడే ఆయన పతనం ప్రారంభమైంది. కానీ అలా నెట్టుకొచ్చారు. 'జగన్ చెబితే వినడు.. సరైన వ్యూహరచన చేయడు..ప్రజలు వ్యతిరేకిస్తున్నారు' అంటూ..పలు సందర్భాల్లో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తరువాత వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. వైసీపీ కార్యక్రమాలకు, జగన్ సమావేశాలకు దుమ్మాకొట్టేస్తున్నారు. తనకు అత్యంత ఇష్టమైన..వైఎస్ఆర్ జయంతి, వర్ధంతులకు కూడా ఆయన హాజరుకాకపోవడం వెనుక ఏదో నిగూఢార్థం దాగుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు..ప్రస్తుతం ప్రసాదరావు తన కుమారుడు, రాజకీయ వారసుడు రామ్మనోహన్ నాయుడి కోసం అలోచిస్తున్నారని సమాచారం. వైసీపీలో రాజకీయ భవిష్యత్తు శూన్యమని ఓ నిర్ణయానికి వచ్చినట్టు భోగట్టా. అందుకే తాడేపల్లిలో జగన్ నిర్వహించిన జిల్లా స్థాయి రివ్యూ సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో అందరి దృష్టి ప్రసాదరావుపైనే పడింది. ఎందుకు హాజరుకాలేదన్న అంశంపై పెద్దఎత్తున చర్చ నడిచింది. అత్యంత విశ్వసనీయవర్గాలసమాచారం ప్రకారం..ఆయన రాజకీయ వైరాగ్యంలో ఉన్నారని.. రాజకీయంగా ఎటు వైపు అడుగులు వేయాలని సమాలోచనలు చేస్తున్నారని తెలుస్తోంది. ప్రసాదరావు ఆలోచనలు అన్నీ కుమారుడు, రాజకీయ వారసుడు ధర్మాన రామమనోహర్ నాయుడు మీదనే ఉన్నాయని ఆయన మనసెరిగిన వారు చెబుతున్నారు. ఏ పార్టీలో చేర్పిస్తే రాజకీయంగా నిలదొక్కుంటారు అని ఆలోచిస్తున్నారట. ఎందుకంటే 2024 ఎన్నికల్లో కుమారుడికి శ్రీకాకుళం శాసన సభ టికెట్ ని ప్రసాదరావు అడిగారు. దానికి జగన్ నిరాకరించారు అన్న ఆవేదన ప్రసాదరావులో ఉంది అని అంటున్నారు. జగన్ తండ్రి వైఎస్ఆర్తో కలిసి రాజకీయాలు చేశానని..అప్పట్లో ఎంతో విలువ ఇచ్చేవారని, కానీ జగన్ మాత్రం కనీసం గౌరవం ఇవ్వడం లేదన్న ఆవేదన సైతం ధర్మానలో ఉంది. ఈ కారణాలు విశ్లేషించుకున్న తరువాతే ధర్మాన వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారని ఆయన అంతరంగికులు చెబుతున్నారు. రాజకీయంగా ఒక వెలుగు వెలిగిన ధర్మాన ప్రసాద్ 2024 ఎన్నికలకు నేను పోటీ చేయను అని చెప్పిన బలవంతంగా పోటీ చేయించారు కూటమి అధికారం రావడం... ఒక భాగమైతే సర్పంచ్ స్థాయిలో ఉంటూ వ్యక్తి ఎమ్మెల్యేగా ఎదగిన గుండు శంకర్ చూసి మరి కాస్త కుమిలిపోతున్నారు. దీంతో క్యాడర్ను కూడా ఎవర్ని కలవకుండా కార్యకర్తలు ఎవరిని కూడా పార్టీ సంబంధించిన వ్యవహారాలు అయితే నా దగ్గరికి రావద్దు అని నేరుగానే చెబుతున్నారు. ఇక సొంత పని ఏదైనా ఉంటేనే మాత్రం రండి. నీ ముక్కు సూటిగానే మొహం మీద చెప్పేశారు దీంతో కార్యకర్తలు ఏం చేయాలో తెలియని అగమ్య గోచరంగా తయారయ్యారు. ధర్మాన రామ్మోహన్ నాయుడు కి రాజకీయం పూర్తిస్థాయిలో నెక్స్ట్ ఎన్నికల్లో బరిలో దించేందుకు ధర్మాన పక్కా వ్యూహం పొందుతున్నారని కొంతమంది చెబుతున్నారు.

# భారత స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్న నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

## – నేడు ఆయన జయంతి



భారత స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్న నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ... అదేవిధంగా దేశ స్వాతంత్రానంతరం, నిరంకుశ నిజం పాలన ముగిసిన తర్వాత తెలంగాణ జెండాను ఎత్తిన తొలి తరం నేతల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరు. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం పదవులను గడ్డిపోచలా భావించారు. తొలి దశ ఉద్యమంలో హింసాకాండను నిరసించి, కాంగ్రెస్ ప్లీనరీలో నిలదీశారు. కాసు కేబినెట్ నుంచి తప్పుకుని ప్రత్యేక తెలంగాణకోసం మంత్రి పదవి వదులుకున్న మొదటి వ్యక్తిగా నిలిచారు. ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నాలను ఎదుర్కొని, తన నివాసం 'జలదృశ్యం'లోనే ఎమ్మెల్యేలను కూడగట్టారు. ఈ జల దృశ్యమే మలి దశ పోరుకి వేదికయ్యింది.1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులు రోజూ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టింద్రు. వారిపై పోలీసులు, మలబార్ నుంచి వచ్చిన మిలటరీ, గూర్ఖా రైఫిల్స్ సైన్యం జరిపిన కాల్పుల్లో అభం శుభం ఎరుగని పిల్లలు, విద్యార్థులు అమరులయ్యింద్రు. ప్రతి పాఠశాల, కళాశాల ఓపెన్ ఎయిర్ జైలుగా మారింది.మంత్రి పదవిని త్యాగం చేసిన మొదటి వ్యక్తి: విద్యార్థులపై పోలీసుల కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో గొంతు విప్పారు. కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో ఉన్న ఆయన.. పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవి వదులుకున్న మొదటి వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ. 1969లో ఏర్పడ్డ తెలంగాణ ప్రజా సమితి యాక్షన్ కమిటీకి బాపూజీ శాశ్వత ఆహ్వానితుడు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బాపూజీ అధ్యక్షతన తెలంగాణ ప్రజా సమితి అనే రాజకీయ పార్టీగా మారింది. లోక్సభ ఎన్నికల్లో పోటీ కూడా చేసింది.నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ అదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించాడు. స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాడు. 1952లో ఆసిఫాబాదు నుంచి ఎన్నికై హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత కూడా శాసనసభ్యుడిగా నుంచి ఎన్నికై 1971 వరకు శాసనసభ్యునిగా కొనసాగినాడు. నిఖార్సయిన తెలంగాణ వాది. తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త. 1969, 2009 రెండు తెలంగాణ ఉద్యమాలలో పాల్గొన్నాడు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి కూడా కృషిచేశాడు. సెప్టెంబర్ 21, 2012 నాడు 97 సంవత్సరాల

# అమెరికా, రష్యాలకు దీటుగా ఇజ్రాయిల్

**న్యూఢిల్లీ :** ఇజ్రాయిల్ పేరు ప్రస్తావనకు రాగానే ఐరన్ డోమ్ గుర్తుకు వస్తుంది. ఇజ్రాయిల్ దేశం తనను తాను కాపాడుకోవడానికి ఏర్పరచుకున్న అత్యంత ఆధునికమైన రక్షణ వ్యవస్థ ఇది. ఒకరకంగా ఇది ఉక్కు కవచం లాగా ఆ దేశాన్ని కాపాడుతూ ఉంటుంది. దాడులను ధైర్యంగా అడ్డుకుంటుంది. ఆకాశం నుంచి క్షిపణులను ప్రయోగించినా వీసమెత్తు నష్టం వాటిల్లదు. పాలస్తీనా, హెజ్ బొల్లా, లెబనాన్ వాటి దేశాల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఇజ్రాయిల్ ఐరన్ డోమ్ తో పాటు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకుంది.. అయితే ఇందులో యారో -2, యారో -3 వ్యవస్థలు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకుంటాయి. అంతరిక్షంలోనే వాటిని పేల్చేసి.. వాటి శకలాలు కూడా దూరంగా పడేలా చేస్తాయి.ఇక ఈ రక్షణ వ్యవస్థలో డేవిడ్ స్ట్రింగ్ అనేది మిడిల్ డిఫెన్స్ సిస్టం గా పనిచేస్తుంది.. 100 నుంచి 200 కిలోమీటర్ల స్వల్పశ్రేణి బాలిష్టిక్ క్షిపణులను ఇది ఎదుర్కొంటుంది. యుద్ధ విమానాలను, డ్రోన్లను ఇది నేలమట్టం చేస్తుంది. దీనికి చిట్ట చివరిలో ఐరన్ డోమ్ అనే వ్యవస్థ ఉంటుంది. దీనిని ఇజ్రాయిల్ విస్తృతంగా వాడుతుంది. హమాస్, హెజ్ బొల్లా వేలాది రాకెట్లను ప్రయోగించగా.. ఐరన్ డోన్ పడగొట్టింది. ఇజ్రాయిల్ దేశానికి అద్భుతమైన రక్షణ వ్యవస్థగా నిలిచింది..ఐరన్ డోమ్ ను ఇజ్రాయిల్ పరిభాషలో "కిప్పాట్ బర్జెల్" అని పిలుస్తుంటారు. ఇది స్వల్ప శ్రేణి ఆయుధాలను సమర్థవంతంగా అడ్డుకుంటుంది. ఇందులో రాడార్, కంట్రోల్ సెంటర్, మిసైల్ బ్యాటరీ వంటి విభాగాలు ఉంటాయి. రాడార్ అనేది దూసుకు వస్తున్న ఆయుధాలను పసిగడుతుంది. అవి నేలను తాకే స్థితిని అంచనా వేస్తుంది. అక్కడ ఒకవేళ ఎటువంటి నిర్మాణాలు లేకపోతే వదిలిపెడుతుంది. ఒకవేళ జనావాసాలు మాత్రం ఉంటే రాకెట్ ప్రయోగిస్తుంది. వెంటనే ధ్వంసం చేస్తుంది. ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఎల్టా, ఎంప్రెస్ట్ సిస్టం, రఫెల్ వంటి సంస్థలు పనిచేశాయి.. దూసుకు వచ్చే రాకెట్లను నేలమట్టం చేయడానికి ఇజ్రాయెల్ తమార్ క్షిపణులను వాడుతుంది. ఇందులో ఎలక్ట్రో ఆస్తిక్ సెన్సార్లు, మల్టిపుల్ స్టీరింగ్ ఫిన్స్ ఉంటాయి. ఇక ప్రతి ఐరన్ డోన్ బ్యాటరీలో నాలుగు లాంచర్లు కచ్చితంగా ఉంటాయి. ఇవి ఒక్కొక్కటి 10 సెకండ్ల వ్యవధిలో పది క్షిపణులను ప్రయోగిస్తాయి. ఇంతటి వ్యవస్థ ఉంది కాబట్టే ఇజ్రాయిల్ దేశం తనను తాను కాపాడుకుంటున్నది. శత్రు దేశాల ఎత్తులను చిత్తులు చేస్తోంది.. అత్యాధునిక ఆయుధ సంపత్తిని పెంచుకొని.. డిఫెన్స్ విభాగంలో అమెరికా, రష్యా దేశాల స్థాయిలో బలమైన శక్తిగా ఎదిగింది. ఇజ్రాయెల్ పదాతి దళాలు- ఈ ఫోర్సెస్ భూమి మీద జరిగే యుద్ధాలకు వాడే దళాలు. ప్రస్తుతం గాజాలో భూతల యుద్ధం చేస్తోంది ఐడీఎఫ్ లోని ఈ గ్రౌండ్ ఫోర్సెస్. ఇజ్రాయెల్ వైమానిక దళం – ఇజ్రాయెల్ గగనతల రక్షణతో పాటు, ఇతర శత్రు దేశాలపై గగనతల యుద్ధం చేయాడానికి, గ్రౌండ్ ఫోర్సెస్ కు సాయపడటానికి ఐఏఎఫ్ పని చేస్తుంది. ప్రస్తుతం గాజాలోనూ, లెబనాన్ లోను ఐ.ఎ.ఎఫ్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇజ్రాయెల్ నౌకాదళం – ఈ విభాగం ఇజ్రాయెల్ చుట్టూ ఉన్న సముద్రతల భద్రతను, రక్షణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తుంది. పై మూడు విభాగాలు ఇజ్రాయెల్ రక్షణలో కీలకంగా పని చేస్తాయి. ఈ దళాలు దేశ భద్రత, రక్షణ చర్యల్లో పని చేసే ఫ్రంట్ ఫోర్సెస్ అని చెప్పాలి. ఇక వీరితో పాటు మిలిటరీ ఇంటలిజెన్స్, సైబర్ డిఫెన్స్ యూనిట్స్ వీరి రక్షణ వ్యవస్థలో కీలకంగా పని చేస్తాయి. దేశ అంతర్గత భద్రత కోసం పని చేసే దళాలు ఇవే... దేశం వెలుపల యుద్ధాలకు పనిచేసే ఐడీఎఫ్ అందులోని అంతర్గత దళాల పని తీరు తెలుసుకున్నాం. ఇప్పుడు దేశంలో లోపల అంతర్గత భద్రత కోసం మరి కొన్ని దళాలను ఆ దేశం ఏర్పాటు చేసుకుంది. దేశం చుట్టూ శత్రువులే ఉన్నాయి. ఇక పక్కనే పాలస్తీనా తీవ్రవాదులతో నిత్యం అతర్గతంగా సవాళ్లు ఎదురవుతుంటాయి. ఎప్పుడైనా ఎక్కడైనా తీవ్రవాదుల బాంబులకు, ఆత్మాహుతి దాడులను ఎదుర్కోవల్సిన పరిస్థితి ఇజ్రాయెల్ దేశానిది. వీటి నుంచి ఇజ్రాయెల్ పౌరులను కాపాడటానికి వివిధ రకాల భద్రతా సంస్థలు పని చేస్తున్నాయి. ఇవి దేశ ప్రజలను, సరిహద్దులను. ప్రభుత్వ సంస్థల రక్షణే ధ్యేయంగా పని చేస్తాయి. షిన్ బెట్ ఈ సంస్థ ప్రధాన విధి దేశంలో అంతర్గత భద్రతను చూసుకోవడం. దేశ అంతర్గత భద్రతకు సవాల్ విసిరే తీవ్ర వాద చర్యల ఉనికిని పసిగట్టి అడ్డుకుంటుంది. దేశ అంతర్గత భద్రతకు సవాల్ విసిరే సంస్థలు, వ్యక్తుల ను గుర్తించి సమాచారం సేకరించడం, దేశ వ్యాప్తంగా తనదైన శైలిలో గూఢాచార్యం నిర్వహించి రక్షణ చర్యలు తీసుకోవడం ప్రధాన విధులు. మగావ్ ) – బోర్డర్ పోలీస్: ఇది మన దేశంలో బీఎస్ఎఫ్ ఎలానో అలా ఇజ్రాయెల్ దేశంలో దేశ సరిహద్దుల్లో భద్రత ఏర్పాట్లు చూస్తుంది. దేశ సరిహద్దుల నుండి వచ్చే సవాళ్లను ఎదుర్కొంటుంది. చుట్టూ శత్రు దేశాల సరిహద్దులు ఉండటంతో అక్కడి వారు రాకుండా, తీవ్రవాద కార్యకలాపాలు జరగకుండా దేశ అంతర్గత భద్రతకు ముప్పు ఏర్పడకుండా ఈ ప్రత్యేక దళం పని చేస్తుంది. సరిహద్దుల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ మగావ్ దళం ముఖ్య విధి అని చెప్పాలి. ఇజ్రాయెల్ పోలీస్ ఫోర్స్ ఇది మన పోలీసుల్లానే దేశ వ్యాప్తంగా ఆ దేశ చట్టాలు అమలు, నేరాల నియంత్రణ, క్రిమినల్స్ ను పట్టుకుని న్యాయస్థానాల ముందు నిలబెట్టి శిక్షలు పడేలా చేయడం వీరి ప్రధాన విధి. ప్రజల రక్షణ అనేది ఇజ్రాయెల్ పోలీసుల ప్రధాన విధి. సరిహద్దు భద్రత దళాలు ఈ దళాలు ముఖ్యంగా వివాదస్పద సరిహద్దు ప్రాంతంలో గస్తీ కాస్తుంటాయి. మనకు పాకిస్థాన్, బంగ్లా సరిహద్దుల్లో ఎలా ఉద్రిక్త పరిస్థితులు ఉంటాయో.. అలాగే సిరియా, లెబనాన్, పాలస్తీనా సరిహద్దుల్లో ఇవి పని చేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగింది. అత్యంత సున్నితమైన ప్రాంతాలు, ఉద్రిక్త పరిస్థిలు ఉండే గాజాస్ట్రిప్, వెస్ట్ బ్యాంక్ ఏరియాల్లో ఈ దళాలు కీలక పాత్ర పోషిస్తాయి.ం ఇక ఆ దేశంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అత్యంత శక్తవంతమైన ప్రత్యేక కార్యాచరణ దళం. మొస్సాద్.మొస్సాద్ – ఇజ్రాయెల్ దళాల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది మొస్సాద్ కోసమే. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన గూడాఛార దళం మొస్సాద్. మనకు రా అంటే రిసెర్ట్ అండ్ అనాలిసిస్ వింగ్ (ఖీంచి) ఎలానో.. మొస్సాద్ ఇజ్రాయెల్ గూఢాచార సంస్థ. దేశంలోపల, వెలుపల ఎన్నో ఆపరేషన్లు నిర్వహించి సక్సెస్ ఫుల్ గూఢాచార సంస్థగా ప్రపంచంలో గుర్తింపు పొందింది. మొస్సాద్ ప్రధాన విధి విదేశాల్లో గూఢచార్యం నిర్వహించడం. ఇజ్రాయెల్ కు ముప్పుగా పరిమణించే దేశాలను, వ్యక్తులను, సంస్థలను, తీవ్రవాద సంస్థలను, ఆర్థిక సంస్థలను, సాంకేతిక సంస్థలను టార్గెట్ చేస్తూ పని చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో మొస్సాద్ ఏజెంట్లు పని చేస్తారు.

దేశ భద్రతే వీరి ప్రధాన విధిగా చెప్పాలి.ఇలా అంతర్గత భద్రత విషయంలో ఇజ్రాయెల్ ఎంత మాత్రం రాజీ పడని దేశంగా పేరు పొందింది. తమ దేశానికి, దేశ వాసులకు ఏదైనా ముప్పు వాటిల్లుతుందని సమాచారం వస్తే ఖండాలు దాటైనా వారి భద్రతా దళాలు స్పెషల్ ఆపరేషన్స్ నిర్వహించి ఆ ముప్పును కలిగించే సంస్థలను న్యూట్రలైజ్ చేస్తాయి. వ్యక్తులైతే మట్టుపెడతాయి. అందుకే ఇజ్రాయెల్ దళాలంటే ప్రపంచంలోని రక్షణ దళాల్లో ప్రత్యేకమైన దళాలుగా గుర్తింపు పొందాయనడంలో సందేహం లేదు. అసాధ్యమైన, సాహసోపేతమైన ఆపరేషన్లు నిర్వహించిన ఘనత వీరి సొంతం. హాలివుడ్ సినిమాలను తలపించే మిలటరీ ఆపరేషన్లు చేసిన చరిత్ర ఇజ్రాయెల్ దళాలది.

# భారత్‌కు బూస్టింగ్ ఇస్తున్న ఆర్థిక సంస్థలు

వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటి. అందులో ఆర్థికంగా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పుడు ఆర్థికంగా దేశం 5వ స్థానంలో ఉంది. మరో మూడు నుంచి నాలుగేళ్లలో 3వ స్థానానికి తీసుకెళ్తానని మోడీ హామీ ఇచ్చారు. భారత ఆర్థిక అభివృద్ధి వేగాన్ని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ వరకు అన్ని ప్రపంచ సంస్థలు విశ్వసించాయి. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ కూడా ఈ జాబితాలో చేరి భారత్ (మూడీస్ ఇండియా జీడీపీ) జీడీపీ వృద్ధి అంచనాను పెంచింది. 2024 క్యాలెండర్ ఇయర్ లో భారత్ 7.1 శాతం వృద్ధిని సాధిస్తుందని మూడీస్ తెలిపింది. భారతదేశ జీడీపీ వృద్ధి అంచనాను మూడీస్ 7.1 శాతానికి సవరించింది. అంతకుముందు రేటింగ్ ఏజెన్సీ 6.8 శాతం అంచనా వేసింది. అలాగే, గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ తన కొత్త ఆసియా-పసిఫిక్ అవుట్ లుక్ లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి దేశ వృద్ధి అంచనాను 6.5 శాతం వద్ద యథాతథంగా ఉంచింది, 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.6 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది.మూడీస్ అనలిటిక్స్ కొత్త నివేదికలో భారత్ లో ద్రవ్యోల్బణ రేటును కూడా ప్రస్తావించింది. మూడీస్ దేశ ఆర్థిక వృద్ధి అంచనాను 30 బేసిస్ పాయింట్లు సవరించగా.., భారత ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతం నుంచి 4.7 శాతానికి తగ్గించింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జూలై, ఆగస్ట్ లో ఆర్బీఐ నిర్దేశిత పరిధిలో 4 శాతం కంటే తక్కువగా ఉంది. రేటింగ్ ఏజెన్సీ ప్రకారం ఆర్థిక సంవత్సరం 2025-26లో భారతదేశంలో ద్రవ్యోల్బణం రేటు ఇప్పుడు వరుసగా 4.5 శాతం, 4.1 శాతంగా అంచనా వేయబడింది.మూడీస్ మాత్రమే కాదు, ప్రపంచ బ్యాంకు నుంచి ఐఎంఎఫ్, ఇతర అంతర్జాతీయ సంస్థలు కూడా భారత ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం కలిగి ఉన్నాయని, అందరూ దేశ జీడీపీ వృద్ధి అంచనాను పెంచారన్నారు.

మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ వ్యయం, స్థిరాస్తిలో పెరిగిన దేశీయ పెట్టుబడులు, మెరుగైన రుతుపవనాల కారణంగా ప్రపంచ బ్యాంకు 2025 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 7 శాతానికి పెంచగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి అంచనాను 20 బేసిస్ పాయింట్లు పెంచి 7 శాతానికి పెంచింది.భారత జీడీపీ వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ సవరించింది. 2024-25 ఆర్థిక ఏడాదిలో 7 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. గతంలో 6.6 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొన్న ప్రపంచబ్యాంక్.. తన అంచనాలను మార్పు చేసింది. వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థికవ్యవస్థ ఆశించిన స్థాయిలో రికవరీ అవుతుండడమే దీనికి కారణమని విశ్లేషించింది. ప్రపంచ భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నా భారత్ ఆర్థికవ్యవస్థ రాణిస్తుందని పేర్కొంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి ఇటీవల భారత జీడీపీ వృద్ధి రేటు నెమ్మదించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వెలువరించిన గణాంకాల ప్రకారం 6.7 శాతంగా నమోదైంది. ఎప్పుడో ఈ గణాంకాలు వెలువడాల్సిఉన్నా.. ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. ఇటీవల ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష సమావేశంలో భారత్ తొలి త్రైమాసికంలో 7.1 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేసింది. కానీ అంతకంటే తక్కువే నమోదైంది. ఈ క్రమంలోనే నొమురా పూర్తి ఏడాదికి వృద్ధి అంచనాలను 6.9 శాతం నుంచి 6.7 శాతానికి తగ్గించింది. గోల్డ్‌మాన్ శాక్స్, జేపీ మోర్గాన్ వంటి సంస్థలు 6.5 శాతంగా ఉండొచ్చని పేర్కొన్నాయి. ప్రపంచబ్యాంక్ మాత్రం 7 శాతం నమోదుకావొచ్చని పేర్కొంది.భారత్ తో పాటు ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీల విశ్వాసం కూడా భారత్ పైనే ఉంది. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి రేటు అంచనాను 6.8 శాతంగా ఏజెన్సీ కొనసాగించింది. దీనితో పాటు, అమెరికా పాలసీ రేటు తగ్గింపు తర్వాత దేశంలో రెపో రేటు తగ్గుతుందని అంచనా. అక్టోబర్ లో జరిగే ఎంపీసీ సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బీఐ) వడ్డీరేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చని ఎస్ అండ్ పీ తెలిపింది.

# ఎదురు తిరుగుతున్న వ్యూహం

**తిరుమల** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాద కల్తీ విషయంలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ వ్యూహం మార్చారు. ఇప్పటి వరకూ నిజాలు తెలుసుకోవాలని ఆయన చాలా మందికి లేఖలు రాశారు. పార్టీ పరంగా ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. కానీ లడ్డూ లో కల్తీ జరగనే లేదు అన్న వాదన మాత్రం గట్టిగా వినిపిస్తున్నారు. అందు కోసం రకరకాల వాదనలతో తెరపైకి వస్తున్నారు. తాజాగా జగన్ స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయించారు. తిరుమలకు కాలి నడకన వెళ్లడంతో పాటు శనివారం ఆలయాల్లో పూజలు చేయాలని పార్టీ క్యాడర్ కు పిలుపునిచ్చారు.తిరుమల లడ్డూ ఇష్యూలో జగన్ అన్యమతస్తుడు కాబట్టే హిందూ సంప్రదాయాలు, సనాతన ధర్మం విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారని పైగా కించ పరుస్తున్నారని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఈ విషయంలో ఎదురుదాడికి వైసీపీ వ్యూహం సిద్ధం చేసుకుంది. చాలా రోజులుగా బయటకు రాని కొడాలి నాని వంటి వారితోనూ ప్రెస్‌మీట్లు పెట్టారు. కల్తీ నెయ్యితో వచ్చిన ట్యాంకర్లను వెనక్కి పంపించామని కల్తీ జరగనే లేదని వాదించారు. అందరూ ఇదే వాదనతో తెరపైకి వస్తున్నారు. శనివారం ఆలయాల్లో పూజలు.. ఆ తర్వాత జగన్ తిరుమల పర్యటన తర్వాత మరంత అగ్రెసివ్ గా కల్తీ జరగలేదన్న వాదనను వినిపించాలనుకుంటున్నారు. మరోవైపు లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఇవ్వడానికి అనేక రూల్స్ మార్చారని తేలింది. కనీస అర్హత లేకపోయినా.. రూల్స్ మార్చి ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఇచ్చారు. అలాగే ఆ డెయిరీ నెయ్యి కేంద్ర ఆరోగ్య శాఖ చేసిన పరక్షల్లోనూ కల్తీగా తేలింది. వీటన్నింటిపై ఇప్పుడు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. ఆ సిట్ నివేదికలో అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి. అసలు నెయ్యి టెండర్ల వెనుక ఉన్నగోల్ మాల్.. ఆయా సంస్థలు నెయ్యిని ఎలా ప్రొక్యూర్ చేస్తాయి.. అసలు తిరుమలలో టెస్టింగ్ చేశారా లేదా అంటి విషయాలు అన్నీ వెలుగులోకి వస్తాయి. ఇవన్నీ తమకు ఇబ్బందికరంగా ఉంటాయని వైసీపీ గట్టిగా నమ్ముతోంది. అందుకే ఆ సిట్ ..చంద్రబాబు చెప్పిందే చెబుతుందని ముందుగానే ఖండిస్తున్నారు.కానీ దర్యాప్తు సంస్థలు చెప్పేదే ఫైనల్. వైసీపీ హయాంలో తిరుమలలో లెక్కలేనన్ని అవకతవకలు జరిగాయని ఇప్పటికే లీకులు వచ్చాయి. ఒక్క టీటీడీ చైర్మనే సగటున రోజుకు ఐదు వందల వరకూ వీఐపీ దర్శన టిక్కెట్లు కేటాయించారని.. నాలుగేళ్లలో మూడున్నర లక్షల మందికి దర్శన టిక్కెట్లు ఇచ్చారని అవన్నీ అమ్ముకున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పెద్దిరెడ్డి, రోజా ట్రావెల్స్ పేరుతో టిక్కెట్లు అమ్ముకున్నారు. అలాగే ఇతర వైసీపీ నేతలు కూడా అదే పని చేశారని అంటున్నారు. ఇక ఎన్నికలకు ముందు తిరుపతిలో పనులకు టీటీడీ నిధులు మళ్లించడం సహా అనేక అవకతవకలు బయటకు వచ్చాయని వాటన్నింటినీ ప్రభుత్వం టైం చూసి బయట పెడుతుందని అంటున్నారు.తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీ వాదనను అంత బలంగా వెళ్లడం లేదు. అందుకే ఎదురుదాడి చేస్తున్నారు. దానికి టీడీపీ .. తిరుమలలో అక్రమాల డాక్యుమెంట్లను రిలీజ్ చేస్తూ కౌంటర్ ఇస్తుంది.

# అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లు

**ఏలూరు :** ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వికేంద్రీకరణ విధానంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపింది. రైతు సేవా కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ-పంట, ఈ కేవైసీ సమాచారంతో రైతులు, కౌలు రైతుల ధాన్యం కొనుగోళ్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ధాన్యం కొనుగోలు తర్వాత ఆధార్ అనుసంధానమైన ఈ-పంట , ఈ-కేవైసీ ద్వారా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.రాష్ట్ర స్థాయిలో ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ, ఏపీ మార్క్ ఫెడ్ సంస్థలు నోడల్ ఏజెన్సీలుగా పనిచేస్తాయని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. ధాన్యం కొనుగోలు చేసే రైస్ మిల్లర్లు కూడా ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. అలాగే కేంద్ర ప్రభుత్వం వరికి నిర్దేశించిన కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాల్ కు రూ.2300, గ్రేడ్ ఏ రకం క్వింటాల్ కు రూ.2320 చెల్లించాలని వెల్లడించింది. ఈ ఖరీఫ్ సీజన్ లో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ధాన్యం సేకరణ, మిల్లింగ్ ఆపరేషన్ల పర్యవేక్షణను జిల్లా కలెక్టర్లు, జేసీలను అప్పగించింది.ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఇటీవల కీలక ప్రకటన చేసింది. అక్టోబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై ఇటీవల జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్? ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాకి సొమ్ము చేరుతుందని వెల్లడించారు. రైతు పండించిన ప్రతి గింజా కొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ధాన్యం అమ్మకం, మిల్లుల ఎంపికలో రైతుకే స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. ప్రతి అడుగులో పారదర్శకంగా వ్యవహరిస్తామని ప్రతీ రైతుకీ భరోసా ఇస్తామని స్పష్టం చేశారు.

# దసరా తర్వాత సెకండ్ లిస్ట్..

**విజయవాడ :** నామినేటెడ్ పోస్టుల భర్తీకి తొలి అడుగు పడింది. 20 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లతో కలిపి 99 మందికి ఫస్ట్ బొనంజా ప్రకటించారు సీఎం చంద్రబాబు. ఇందులో జనసేనకు మూడు, బీజేపీకి ఒక కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించారు.ఐతే తొలి విడత జాబితాలో ఉంటారనుకున్న కొందరు ఆశావహులు పేర్లు మాత్రం కనిపించలేదు. ఎన్నికల్లో ఫస్ట్ మీకే ప్రాధాన్యమని అధినేత హామీ ఇచ్చిన ఆ నేతలు నెక్స్ట్ లిస్టుకు ఎందుకు షిఫ్ట్ అయ్యారు? తొలి జాబితాలో కూడికలు తీసివేతలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం?..ఏపీలో పదవుల పందేరానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 20 కార్పొరేషన్లు, వాటి డైరెక్టర్లు కలిపి మొత్తం 99 మందికి ఫస్ట్ లిస్టులో పదవులు కట్టబెట్టారు సీఎం చంద్రబాబు. ఇందులో ముగ్గురు త్యాగరాజులుతోపాటు యువనేత లోకేశ్ పాదయాత్ర, ఆయన సొంత నియోజకవర్గం మంగళగిరిలో గట్టిగా పనిచేసిన నేతలకు ప్రాధాన్యం దక్కిందని చెబుతున్నారు.అదేవిధంగా గత ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడిన దామచర్ల సత్య వంటివారికి అగ్రతాంబూళమే దక్కిందని చెబుతున్నారు. ఇక సీనియర్లకు అవకాశం కల్పిస్తూనే జూనియర్లను ప్రోత్సహించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.కూటమిలో సమన్వయం కమిటీ నిర్ణయానికి తగ్గట్లు 20 మందితో ప్రకటించిన తొలిజాబితాలో జనసేన, బీజేపీ నేతలకు పదవులు దక్కాయి. ఐతే బీజేపీ కోటాలో పదవి దక్కించుకున్న లంకా దినకర్‌కు గతంలో టీడీపీతో అనుబంధం ఉండటం చర్చకు తావిస్తోంది. ఇక జనసేనకు కేటాయించిన మూడు చైర్మన్ పదవులు కీలకమైనవేనని చెబుతున్నారు.పట్టణాభివృద్ధి, చిన్న పరిశ్రమలు, పౌర సరఫరాలు వంటి ముఖ్యమైన కార్పొరేషన్లు జనసేన దక్కించుకుంది. ఆ పార్టీకి కేటాయించిన మూడు కార్పొరేషన్లలో ఒకటైన పౌర సరఫరాల కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ కూడా జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఉండటం విశేషం. ఇక తొలి జాబితా తర్వాత మరిన్ని పదవుల ప్రకటన త్వరలోనే ఉంటుందని, దసరాలోగా రెండో విడత పదవుల భర్తీ ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.వాస్తవానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో చాలా మంది నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇందులో గత ఎన్నికల్లో సీట్లు కోల్పోయిన 31 మంది టీడీపీ నేతలకు ప్రాధాన్యం ఉంటుందని భావించారు. ముఖ్యంగా పిఠాపురం సీటు వదలుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, మైలవరం సీటును త్యాగం చేసిన మాజీ మంత్రి దేవినేని ఉమాకు తొలి అవకాశం దక్కుతుందని ప్రచారం జరిగింది. అదేవిధంగా టీటీడీ పాలకవర్గం నియామకం కూడా ముందు ఉంటుందని చెప్పారు. కానీ, తొలి జాబితాలో మాజీ మంత్రి దేవినేని ఉమాతోపాటు మాజీ ఎమ్మెల్యే వర్మకు అవకాశం దక్కలేదు. ఇక టీటీడీ బోర్డుపైనా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు.తొలి జాబితాలో కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కని నేతలకు రెండో జాబితాలో అవకాశమిస్తారా? లేక మరేదైనా ప్రత్యామ్నాయం చూపుతారా? అనే చర్చ ఆసక్తికరంగా మారింది. మాజీ మంత్రి ఉమా, మాజీ ఎమ్మెల్యేలు వర్మ, ఆలపాటి రాజా వంటివారు నామినేటెడ్ రేసులో ముందున్నారని వినిపించినా, లిస్టులో వారి పేర్లు లేకపోవడంతో పార్టీ శ్రేణులు అవాక్కయ్యాయి.పైగా మాజీ మంత్రి ఉమాకు కేటాయిస్తారని ప్రచారం జరిగిన ఆర్టీసీ చైర్మన్ పదవిని సీనియర్ నేత, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు కట్టబెట్టారు. దీంతో ఉమాకు ఎలాంటి ప్రాధాన్యమిస్తారనేదే పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే సమయంలో సీట్లు త్యాగం చేసిన వారిలో కర్రోతు బంగార్రాజు, పీలా గోవింద సత్యనారాయణ, మంతెన రామరాజులకు ప్రాధాన్యం దక్కడం విశేషంగా చెబుతున్నారు.మొత్తానికి తొలి జాబితా విడుదలైనా? ఆశావహులను మాత్రం సంతృప్త పరచలేకపోయిందనే కామెంట్లే వినిపిస్తున్నాయి. మొదటి జాబితాలో కీలకమైన కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించినప్పటికీ.. ఎవరూ ఊహించని నేతలు పదవులు దక్కించుకోవడమే కూటమిలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా పదవులు దక్కించుకున్న 16 మందిలో టీం లోకేశ్‌లో సభ్యులు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. ఏదిఏమైనా పదవుల భర్తీ జాతర మొదలు కావడంతో కూటమి పార్టీల్లో సందడి కనిపిస్తోంది.

# ఈటెలకు కృష్ణయ్యతో బ్రేక్...

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. 2020 నుంచి 2023 వరకు బీజేపీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అధిష్టానం ఎన్నికల సమయంలో తప్పించింది. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల ఒత్తిడికి బీజేపీ అధిష్టానం తలొగ్గిందన్న వాదనలు వినిపించాయి. దీంతో అప్పటి వరకు జోష్‌గా ఎన్నికలకు సిద్ధమైన కేడర్ ఒక్కసారిగా డీలా పడింది. కిషన్‌రెడ్డి సారథ్యంలో ఎన్నికలకు వెళ్లిన కాషాయ పార్టీ కేవలం 8 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే గెలిచింది. బండి సంజయ్ తప్పుకున్న తర్వాత కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకుని అధికారంలోకి వచ్చింది. ఇదిలా ఉంటే.. బండి సంజయ్‌ను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడానికి కొత్తగా పార్టీలోచేరిన ఈటల రాజేందర్‌తోపాటు, రఘునందన్‌రావు, మరికొందరు నేతలు కారణమని ప్రచారం జరిగింది. బీసీ నేత అయిన బండిని తప్పించేందుకు మరో బీసీ నేత అయిన ఈటల రాజేందర్ యత్నించడమే సంచలనంగా మారింది.

దీంతో పార్టీలోని బీసీలు రెండు వర్గాలుగా విడిపోయారు. సంజయ్‌కి కొన్ని వర్గాలు, ఈటల రాజేందర్‌కు కొన్ని కులాలు మద్దతు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీలను ఒక్కటి చేసేందుకు కమలం అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యను తెరమీదకు తెచ్చే ప్రయత్నం చేస్తోంది.రాజ్యసభ ఎంపీ అయిన ఆర్.కృష్ణయ్య.. సైలెంట్‌గా వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా ఆమోదించినట్లు రాజ్యసభ నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు విషయం ఎవరికీ తెలియదు. ఇలా జగన్‌కు షాక్ ఇచ్చిన కృష్ణయ్య.. ఇప్పుడు కమలంలో చేరేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. మోపిదేవి వైసీపీని వీడిన సమయంలోనే ఆర్. కృష్ణయ్య కూడా పార్టీని వీడతారని ప్రచారం జరిగింది. కానీ, ఆయన తాను జగన్ వెంటే ఉంటానని ప్రకటించారు. కానీ సడన్‌గా హ్యాండ్ ఇచ్చారు.కొత్త పార్టీ పెట్టాలని ఆర్.కృష్ణయ్య ఆలోచన చేశారు. బీసీల కోసం ప్రత్యేక పార్టీ ఉండాలని భావించారు. కానీ, ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జాతీయ నాయకత్వం కొత్త పార్టీ పెట్టకుండా బ్రేక్ వేసింది. ఆయనను కమలంలోకి ఆహ్వానించి రాజ్యసభ టికెట్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇదే సమయంలో కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ కూడా కృష్ణయ్యకు మద్దతు తెలిపారు. బీజేపీలో బీసీలను చీల్చిన ఈటల రాజేందర్‌కు చెక్ పెట్టే వ్యూహంతో కృష్ణయ్యను పార్టీలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కృష్ణయ్య వస్తే.. పార్టీలోని బీసీలంతా ఒక్కటవుతారని, పార్టీకి అది ప్లస్ అవుతుందని, వచ్చే ఎన్నికల నాటికి బీసీ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం ఉంటుందని బీజేపీ అధిష్టానం కూడా బావిస్తోంది. దీంతో ఆర్. కృష్ణయ్య కూడా బీజేపీలో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## అధికారికంగా...
# బ్లాక్ టిక్కెట్ల దందా
### - కొత్త సినిమాల విడుదలలో నయా ట్రెండ్




అగ్ర హీరోల సినిమాలు విడుదల సందర్భంగా టిక్కెట్ల రేట్లు పెంచి రెండు వారాల్లోనే పెట్టిన పెట్టుబడి వచ్చేలా సినిమా నిర్మాతలు ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు కూడా ప్రజల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వారికి రేట్లు పెంచుకునేందుకు సహకరిస్తున్నాయి. దీంతో టిక్కెట్లు అమాంతంగా పెరుగు తున్నాయి. అంతేమేరకు బ్లాక్ టిక్కెట్లు అమ్ముతున్నారు. ఇకపోతే మిడ్‌నైట్ ఫ్యాన్స్ షో, బెనిఫిట్ షోలు వేయడం ద్వారా మరింత గుంజేస్తున్నారు. తమ అభిమాన హీరో సినిమాను అందరికన్నా ముందుగా చూడాలని ఫ్యాన్స్ చూపించే ఉత్సాహాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. దాని కోసం ఎంత వెచ్చించ డానికైనా అభిమానులు వెనకాడరు. దానిని ఆయుధంగా చేసుకుని బెనిఫిట్ షో నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన 'దేవర' సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆరేళ్ల తర్వాత ఎన్టీఆర్ సోలోగా తెరపై కనిపిస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఎగబడుతున్నారు. ఫ్యాన్స్ క్రేజ్‌ను బట్టి మెయిన్ సిటీల్లో అభిమానుల కోసం బెనిఫిట్ షోలు ఏర్పాటు చేయడం అనవాయితీ. ఇప్పుడు అగ్ర తారలు, భారీ బడ్జెట్ చిత్రాలకు ప్రభుత్వం కూడా అదనపు షోలు, టికెట్ రేట్ పెంచడం లాంటి వెసులుబాటు కల్పిస్తోంది. గురువారం అర్ధరాత్రి దేవర బెనిఫిట్ షోలను ఏర్పాటు చేశారు మేకర్స్. మిడ్ నైట్ షో ఒంటి గంటకు ప్రదర్శన జరగనుంది. హైదరాబాద్‌లో మొత్తంమీద 20కి పైగా థియేటర్స్‌లో మిడ్ నైట్ షోలు ప్లాన్ చేశారు. అయితే వీటిని ఆన్‌లైన్ బుకింగ్స్ పెట్టకుండానే డైరెక్ట్‌గా టికెట్లను అమ్ముతున్నారు. దీని వెనుక చిత్ర పరిశ్రమకు చెందిన కీలక వ్యకులతోపాటు కొందరు పీఆర్‌ఓలు ఉన్నారు. క్రేజీ సినిమాలు, స్టార్ హీరోల సినిమాలు విడుదల సమయంలో ఫ్యాన్స్ క్రేజ్‌ను క్యాష్ చేసుకుంటున్నారీ మూవీ టికెట్ మాఫియా ముఠాలు. దేవర సినిమా బెనిఫిట్ షో చూడాలంటే అక్షరాల రెండువేలు చెల్లించాల్సిందే! మామూలుగా మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో సినిమా టికెట్ ధర హై క్లాస్ అయితే రూ.500 ఉంటుంది. కానీ బెనిఫిట్ షో ధర ఆకాశాన్ని అందుకున్నట్లు రూ.2000 పలుకుతోంది. ఏఎంబీలో ఒక్కో స్క్రీన్ సీటింగ్ కెపాసిటీ 300 వరకూ ఉంటుంది. అంటే ఒక్క షో కి వసూలు చేసే మొత్తం ఆరు లక్షల రూపాయలు. బెనిఫిట్ షోకి ప్రత్యేకంగా కట్టాల్సిన టాక్స్ ఏమీ ఉండదు. షో నిర్వాహకులు హోల్ థియేటర్ బుక్ చేసుకుంటారు. అది కూడా టాక్స్‌తో కలిపే. ఇందులో ఖర్చులు పోగా దాదాపు సగానికి సగం తమ జేబులో వేసుకుంటున్నారని టాక్ నడుస్తోంది. ఇప్పుడు ఇదొక దందాగా మారింది. ఇలాంటి వాటిపై ప్రభుత్వం కన్నేయాల్సి ఉంది. టిక్కెట్ల రేట్లు పెంచకుండా చూడాలి. హీరోలు కోట్లకుకోట్లు తీసుకుంటూ ప్రేక్షకులను గుల్ల



## అబుదాబి వేదికగా
# ఐఫా వేడుకలు
### - ప్రత్యేక నృత్యప్రద్శనకు సిద్దమైన నటి రేఖ

సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఐఫా అవార్డుల వేడుక అబుదాబి వేదికగా సెప్టెంబర్ 27 నుంచి 29 వరకు జరగనుంది. ఈ సినీ పండగ ఐఫా 2024 కోసం ఇప్పటికే సెలబ్రిటీలు అక్కడికి చేరుకున్నారు. ఇక ఈ ఈవెంట్‌లో సీనియర్ నటి రేఖ నృత్య ప్రదర్శన ప్రత్యేకం కానుంది. ప్రతి ఏడాది తన డ్యాన్స్‌తో ఆకట్టుకునే రేఖ ఈ ఏడాది కూడా ప్రత్యేకత చాటుకోనున్నారు. 150 మంది డ్యాన్సర్లతో 22 నిమిషాల పాటు వేదికపై డ్యాన్స్ చేయనున్నారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ ఆనందం వ్యక్తంచేశారు. 'ఐఫాకు ఎప్పుడూ నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇది అవార్డుల వేడుక మాత్రమే కాదు కళ, సంస్కృతి, ప్రేమను సూచిస్తుంది. ఐఫా వేదిక నాకు సొంత ఇంటిలా అనిపిస్తుంది. అందమైన ప్రదర్శనతో ఈ వేదికపై భారతీయతను చాటడం నాకు లభించిన ఓ అవకాశం. ఇంత గొప్ప ఫెస్టివల్‌లో మరోసారి భాగం కావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఐఫా 24వ ఎడిషన్‌లో మీ అందరితో కలిసి మధురమైన జ్ఞాపకాలను సృష్టించుకోవడానికి ఎదురుచూస్తున్నాను. ఈ ప్రయాణం ఎప్పటికీ మర్చిపోలేనిది' అని చెప్పారు. ఈ ప్రదర్శనకు ఆమె మనీష్ మల్హోత్ర ప్రత్యేకంగా డిజైన్ చేసిన క్యాస్టూమ్‌ను ధరించనున్నారు. ఈ ఏడాది జరగనున్న ఐఫా వేడుకలకు బాలీవుడ్ స్టార్స్ హోస్ట్‌లుగా వ్యవహరించనున్నారు. షారుక్ ఖాన్, కరణ్ జోహార్, విక్కీ కౌశల్ ఈ ఈవెంట్‌లో యాంకర్లుగా సందడి చేయనున్నారు. షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో పాటు మరికొందరు అగ్ర తారలు ఈ వేడుకలో పాల్గొననున్నారు.

# దేవరకు స్టీల్ ప్లాంట్ సెగ




ఏపీలో 'దేవర' సినిమాకు మరో చిక్కు ఎదురైంది. అదేంటంటే.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'దేవర' మద్దతు ఇవ్వాలని జన జాగరణ సమితి వినూత్న రీతిలో నిరసన చేపట్టింది. 'దేవర' సినిమా పోస్టర్లపై 'సేవ్ వైజాగ్ స్టీల్ ప్లాంట్' నినాదాల పోస్టర్లను జన జాగరణ సమితి నేతలు అతికించారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి జూనియర్ ఎన్టీఆర్ మద్దతు ఇవ్వాలని జన జాగరణ సమితి విజ్ఞప్తి చేసింది. దీంతో జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమాకు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం సెగ తాకింది. విశాఖపట్నంలో చాలా చోట్ల 'దేవర' సినిమా పోస్టర్లపై 'సేవ్ వైజాగ్ స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అనే నినాదాలతో ఉన్న పోస్టర్లు వెలిశాయి. మరి ఈ పోస్టర్ల వ్యవహారంపై జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తాడా? విశాఖ ఉక్కు ఉద్యమానికి జూనియర్ ఎన్టీఆర్ మద్దతు ఇస్తాడా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది.

## హాలీవుడ్ స్థాయిలో
# దేవర నిర్మాణం
### - మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ కితాబు



ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన అభిమానులు, సినీ ప్రియులను అలరించేందుకు ఎన్టీఆర్ 'దేవర'తో సిద్ధమయ్యారు. యంగ్‌టైగర్ జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ జంటగా నటించిన ఈ సినిమా రికార్డు స్థాయిలో ప్రీ సేల్స్ రాబట్టి అంచనాలను అమాంతం పెంచేసింది. ఎన్టీఆర్ నుంచి దాదాపు ఆరేళ్ల సుధీర్ఘ గ్యాప్ తర్వాత వస్తున్న సోలో సినిమా ఇదే కావడంతో అభిమానులు కూడా ఈ మూవీపై చాలా ఆశలు పెట్టుకున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో దేవర' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ప్రతి వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంగీతం అందించిన అనిరుధ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకొని అంచనాలను రెట్టింపు చేశారు. 'బ్యాగ్రౌండ్ మ్యూజిక్ అందించే సమయంలో నేను ఆశ్చర్యపోయాను. ఇంత గొప్పగా సినిమాను ఎలా తెరకెక్కించారని ఆలోచిస్తూనే ఉన్నా. ఇది అద్భుతమైన యాక్షన్ డ్రామా. ఇలాంటి సినిమాలకు నేపథ్య సంగీతం అందించాలంటే మంచి ప్రయోగాలు చేయొచ్చు. ప్రేక్షకులకు ఫ్రెష్ అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతో 95 శాతం రీరికార్డింగ్ పనులను విదేశాల్లోనే పూర్తి చేశాం. 'దేవర' సినిమా చూస్తున్నప్పుడు మీకు 'అవెంజర్స్', 'బ్యాట్‌మ్యాన్' వంటి హాలీవుడ్ సినిమాలు చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ సినిమాలో సంగీతానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఎమోషన్, డ్రామా, యాక్షన్, ఆవేశం, అన్నీ ఉన్నాయి. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు అద్భుతమైన అనుభూతిని పొందుతారు. ఈ సినిమాను ఫస్ట్ డే, ఫస్ట్ షో చూడాలనుకుంటున్నా. కొరటాల శివ నన్ను హైదరాబాద్‌లో ఏ థియేటర్‌కు తీసుకెళ్లినా నాకు ఇష్టమే. అభిమానులతో కలిసి ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నా. మేము ఈ సినిమాను ఎంత ఎంజాయ్ చేశామో వారు కూడా అదేస్థాయిలో ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా' అని చెప్పారు. ఈ సినిమాతో జాన్వీ కపూర్ తెలుగు తెరపై మెరవనున్నారు. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించారు. నందమూరి కల్యాణ్ రామ్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు.

## ఎమర్జెన్సీకి
# లైన్ క్లీయర్ అయ్యే చాన్స్
### - సున్నిత అంశాలు తొలగించాలని సూచన




కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు లైన్ క్లియర్ అయ్యేలా కనిపిస్తోంది. చిత్ర విడుదలకు కేంద్ర సెన్సార్ బోర్డ్ బ్రేకులు వేసిన విషయం తెలిసిందే. ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ నెల 6న విడుదలకావాల్సి ఉంది. 1975-77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో తెరకెక్కించిన ఈ సినిమాలో కంగనా రనౌత్.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించింది. అయితే ఈ సినిమాలో సిక్కుల మనోభావాలను కించపరిచే సన్నివేశాలు ఉన్నాయని, ఆపరేషన్ బ్లూస్టార్ నేపథ్యంలో తీసిన సన్నివేశాలు వివాదాస్పదంగా ఉన్నాయని సెన్సార్ బోర్డ్ విడుదలకు అనుమతిని నిరాకరించింది. దీంతో కంగన టీమ్ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు సెన్సార్ సర్టిఫికెట్ విషయంలో సెప్టెంబర్ 25లోగా ఒక నిర్ణయానికి రావాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ అంశంపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. సినిమాలో కొంత సున్నితమైన కంటెంట్ ఉందని.. వాటిని తొలగిస్తే సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు కోర్టుకు తెలియజేసింది. దీంతో నిర్మాణ సంస్థ సెన్సార్ బోర్డు సూచనలపై నిర్ణయం తీసుకోవడానికి సమయం కోరింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేసింది. ఈలోగా నిర్ణయం తీసుకోవాలని నిర్మాణ సంస్థను కోర్టు ఆదేశించింది. ఈ పరిణామాలతో 'ఎమర్జెన్సీ' విడుదలకు త్వరలో చిక్కులు తొలుగుతాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## పవన్ కల్యాణ్ రియల్ లైఫ్ హీరో
### క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ

క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రియల్ లైఫ్ హీరో అని అన్నారు. సోషల్ మీడియా వేదికగా అభిమానులు, నెటిజన్లతో తరచూ ఇంటరాక్ట్ అవుతూ నెటిజన్ల ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానమిచ్చే ఆయన తాజాగా పవన్‌కల్యాణ్ గురించి మాట్లాడారు. ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ పవన్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. 'కృష్ణవంశీగారు మీ సినిమాలంటే మాకెంతో గౌరవం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో చర్చనీయాంశంగా మారిన అంశంపై అనుభవం ఉన్న దర్శకుడిగా మీ అభిప్రాయాన్ని తెలుసుకోవాలనుకుంటున్నాం' అని ఎక్స్‌లో నెటిజన్ అడగగా దానికి ఆయన సమాధానమిచ్చారు. 'మన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై నాకు ఎంతో ప్రేమ, గౌరవం ఉన్నాయి. అవినీతిమయంగా మారిన రాజకీయాల్లో ఓ వ్యక్తి విలువలు, విశ్వాసాలు నింపేందుకు కష్టపడుతున్నాడు. భగవంతుడు ఆయనకు ఎప్పుడూ అండగా ఉండాలని కోరుకుంటున్నా. నిజం ఎప్పటికైనా నిజమే. దాన్ని నిరూపించడానికి ఎవరి అంగీకారం అవసరం లేదు. పవన్ కల్యాణ్ రియల్ లైఫ్ హీరో. ఇది మరోసారి రుజువైంది. ఆయన లాంటి రాజకీయ నాయకులు ఇంకా ఎంతోమంది రావాలి. యోగి ఆదిత్యానాథ్ తర్వాత అలాంటి విలువలు, తెలివితేటలు ఉన్న ప్రత్యేక రాజకీయవేత్త పవన్. దేవుడు ఆయనకు ఎప్పుడూ తోడుగా ఉంటాడు' అని సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఆంధ్రాలో తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ వివాదంపై పవన్‌కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. మరో నెటిజెన్ 'అన్నం' సినిమా అప్డేట్ ఇవ్వండి, అది పరమాన్నం అయినా, గంజి అన్నం అయినా పర్లేదు.. పర్లేదు. కానీ ఆ సినిమా మాత్రం కావాలి అనడిగారు. ఆ సినిమాకు నిర్మాత, డబ్బు కావాలి, ప్రస్తుత సమయంలో బిజినెస్ డైనమిక్ కష్టతరంగా మారాయి. కానీ ఆ సినిమా తప్పకుండ వస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.

# హైడ్రా కూల్చివేతల్ని వ్యతిరేకిస్తే కబ్జాల్నిసమర్థించినట్లేనా.?

**- చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోనే కూల్చివేతలు - హైడ్రాను వ్యతిరేకిస్తే ఎవరికి నష్టం.**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో అతి భారీ వర్షం కురిసింది. ఎంత అంటే ఎప్పుడూ నీళ్లు చూడని రోడ్లు కూడా నదుల్లా పారాయి. పదుల సంఖ్యలో జనం కొట్టుకుపోయారు. హైదరాబాద్‌లోని సగం ఇళ్లు నీట మునిగాయి. అంత వరద వందేళ్లలో రాలేదని అప్పటి ప్రభుత్వం చెప్పింది. నాలాలు కబ్జాకు గురయ్యాయని చెరువుల్ని కబ్జా చేశారని అన్నింటినీ క్లియర్ చేసి మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా చూస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో కూల్చివేతల్ని వ్యతిరేకిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పు చేస్తోందని అంటోంది. హైడ్రా బాధితులకు అండగా ఉంటామని చెబుతోంది. అంటే కబ్జాలు చేసిన వాళ్లకు బీఆర్ఎస్ అండగా ఉంటుందా.? ఇదే సపోర్టు ఉంటే మరతంగా కబ్జాలు పెరగవా ?. దీని వల్ల ఇతర ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఉంటుందా.

### హైడ్రా కూల్చివేతలు పూర్తిగా చెరువులు, ప్రభుత్వ భూముల్లోనే

హైడ్రా ఇప్పటి వరకూ ఒక్కటంటే ఒక్క చోట కూడా ప్రైవేటు ల్యాండ్స్ లో కూల్చివేతలు చేపట్టలేదు. ప్లాన్ ప్రకారం కట్టలేదనో మరో కారణమో చూపి కూలగొట్టలేదు. అంటే ప్రైవేటు ఆస్తుల జోలికి వెళ్లలేదు. ఎక్కడ కూలగొట్టిన చెరువులు, ప్రభుత్వ భూముల్లో కబ్జా చేసిన కట్టిన వాటినే కూలగొట్టారు. అక్కడ కబ్జా చేసి అమ్ముకున్న వాళ్లు పరారయ్యారు. కొనుకున్న వాళ్లు నష్టపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం వారికి ఏమైనా న్యాయం చేస్తుందో లేదో స్పష్టత లేదు. ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు కానీ కూల్చి వేతల్ని ప్రశ్నిస్తే కబ్జాల్ని సమర్థించినట్లే అవుతుంది. దీని వల్ల బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లో కూడా అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

### నివాస ప్రాంతాలను కూలగొట్టడం లేదన్న హైడ్రా

హైడ్రా ఇప్పటికీ నివాసం ఉన్న ప్రాంతాలను కూలగొట్టడం లేదని వారికి సమయం ఇస్తామని చెబుతోంది. కొత్తగా నిర్మాణంలో ఉన్నవాటిని మాత్రం వదిలి పెట్టేది లేదని చెబుతోంది. గత పదేళ్ల కాలంలో చెరువులు, ప్రభుత్వ భూములు విపరీతంగా కబ్జా అయ్యాయి. ఇటీవల కిష్టారెడ్డిపేటలో కూల్చివేసిన ఇళ్లు ఉన్నది ప్రభుత్వ భూమే. అలా వదిలేస్తే కబ్జా దారులకు వదిలేసినట్లవుతుంది. ఆ ధైర్యంతో వారు మరిన్ని కబ్జాలు చేస్తారు. ఈ విషయంలో కిష్టారెడ్డి పేట లేకపోతే ఆ చుట్టపక్కల ప్రభుత్వానికి మద్దతే ఉంది. అవి ప్రభుత్వ భూములని తెలిసి కూడా చాలా మంది కొనుగోలు చేశారని మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తే తమ జోలికి రారన్నది వారి ధైర్యమని అనుకున్నారు. కానీ ప్రభుత్వం మారడంతో మొత్తం సీన్ మారిపోయింది.

### హైదరాబాద్ మునగకుండా ఉండాలంటే హైడ్రా కావాల్సిందే

హైడ్రా ఎక్కడా ప్రైవేటు ఆస్తుల జోలికిరావడం లేదు కాబట్టి మెజార్టీ ప్రజలు సమర్థిస్తున్నారు. కృష్ణానది ఒడ్డున ఉన్న విజయవాడకు కృష్ణా నుంచి కాకుండా బుడమేరు నుంచి వచ్చిన ముప్పు వల్ల సగం విజయవాడ ప్రజలు నష్టపోయారు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు న్యాయంగా ప్రైవేటు స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికి రాకండా ఉండాలంటే ఖచ్చితంగా చెరువుల్ని నాలాల్ని కాపాడుకోవాలని అంటున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి మద్దతు లభిస్తోంది. మూసి విషయంలో నిరుపేదలకు ప్రత్యామ్నాయం చూపించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది కాబట్టి అక్కడా వ్యతిరేకత రాదని వచ్చినా సపోర్టే ఎక్కువ ఉంటుందని భావిస్తున్నారు.

# కాంగ్రెస్ తుఫాన్‌లో బిజెపి కొట్టుకుపోవడం ఖాయం

**- హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్**



**ఛండీగఢ్ (ప్రశ్న న్యూస్):** దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ పక్కా ప్రణాళిక ప్రకారం ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో ఉద్యోగాల కొరతకు మోదీ కారణం కాదా? అని ప్రశ్నించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చండీగఢ్‌లో పర్యటించారు. ప్రధాని మోదీ ప్రజలను విభజించి పాలిస్తున్నారనీ, ఒకరిని చూసి మరొకరు అసహ్యించుకునేలా తయారు చేశారని మండిపడ్డారు. హరియాణాలో భాజపా కుప్పకూలడం ఖాయమని, తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తుపాను రాబోతోంది. అందులో భాజపా కొట్టుకుపోవడం పక్కా. రాష్ట్రాన్ని ఆ పార్టీ సర్వనాశనం చేసింది. అందుకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు. ఇటీవల అమెరికా వెళ్లినప్పుడు అక్కడ ఉంటున్న హరియాణా వాసులను కలిశాను. డల్లాస్, టెక్సాస్‌లో ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది ఉన్నారు. ఇక్కడికెలా వచ్చారని అడిగితే.. హరియాణాలో కనీసం ఉపాధి దొరకడం లేదు. ఎలాగైన బతుకుసాగించాలన్న ఉద్దేశంతో ప్రమాదకర స్థితిలో కజకిస్థాన్, తుర్కియే, దక్షిణ అమెరికా దేశాలు దాటి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొందరు తమ వ్యవసాయ భూమిని విక్రయించి, ఆ డబ్బులతో అమెరికా వెళ్లినట్లు చెప్పారు. ఇక్కడే ఉపాధి అవకాశాలు ఉంటే యువతకు ఇలాంటి గతి పట్టేదా? ప్రజల తలరాతలు మారాంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని రాహుల్ గాంధీ అన్నారు.

# సిరిసిల్ల నేతకు ఉరేసిన రేవంత్

**- బిఆర్ఎస్ నేత కెటిఆర్ ఘాటు విమర్శలు**

**రాజన్న (ప్రశ్న న్యూస్):** రాష్ట్రం ఏర్పడ్డాక ఎనిమిదేండ్ల పాటు సిరిసిల్ల నేతన్నలను అన్ని రకాలుగా ఆదుకుని, చేతి నిండా పని కల్పించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని సంకల్పించాం.. కానీ ఈ పిచ్చోడికి అర్థం కావడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగినట్టు తెలంగాణలో ఆత్మహత్యలు జరగొద్దని చెప్పి ఎనిమిదేండ్ల పాటు 3,312 కోట్ల ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చారు. దీంతో ఆత్మహత్యలు బంద్ అయ్యాయి. ఆదాయం డబుల్ అయింది. ఈ క్రమంలోనే ఆధునీకరణ వైపు ఆలోచనలను చేస్తూ సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని కేసీఆర్ సంకల్పించారు . రెండు మూడు బస్సుల్లో తమిళనాడులోని తిర్పూర్, కోయంబత్తూరుకు నేతన్నలను పంపించాం. ఎందుకంటే మరో తిర్పూర్ మాదిరిగా సిరిసిల్లను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో. జీతాలు డబుల్ అయి, ఆత్మహత్యలు ఆగి ఇప్పుడిప్పుడు ముఖం తెలివికి వస్తున్న సమయంలోనే మా ప్రభుత్వం పోయి దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది అని కేటీఆర్ తెలిపారు. నా మీద కోపంతో.. ఆ కక్షను సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద తీర్చుకుంటున్నారు రేవంత్. మొత్తం బతుకమ్మ చీరలు ఆర్డర్లు బంద్ చేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం లంబకోణం జరిగిందని డైలాగ్‌లు కొట్టారు. ఎంక్వైరీ చేసుకోమని శాసనసభా వేదికగా చెప్పాను. సూరత్ నుంచి తీసుకొచ్చారని సీఎం సన్నాయి నొక్కులు నొక్కబోతే.. మొదటి ఏడాది కొంత తెచ్చాం.. ఆ రోజున్న డైరెక్టరే, ఇప్పుడు సెక్రటరీగా ఉన్నారు. ఎంక్వైరీ చేసుకోమని చెప్పాను. కానీ ముందుకు రాలేదు. కుంభకోణం లేదు.. లంబకోణం లేదు.. నీవు ఓ పిచ్చోడివి అని చెప్పాను. మీ ప్రభుత్వం వచ్చాక పెద్ద పెద్ద మాటలు నరికారు మంత్రులు, స్థానిక నాయకులు. చేనేత కార్మికులకు 365 రోజులు ఉపాధి కల్పిస్తామన్నారు. నాలుగైదు రోజులైతే 11 నెలలో అడుగు పెడుతుంది ఈ ప్రభుత్వం. మరి ఈ కాలంలో ఏం సాధించారు. మా ప్రభుత్వంలో మొత్తం తొమ్మిదిన్నరేండ్లలో సిరిసిల్లకు 3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చాం. మరి మీరు 365 రోజులు ఉపాధి కల్పించాలని అనుకున్నారు కదా.. ఆర్డర్లు డబుల్ ఇవ్వాలి కదా. నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదు. తెలిసీ తెలియని కాంగ్రెస్ సన్నాసుల మాటలకు ఆగం కావొద్దు. మీ తరపున కొట్లాడుతాం.. మీరు కూడా పోరాటానికి ముందుకు రావాలి. వారి ఎత్తుగడలకు ఆగం కాకండి అని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి అన్న విషయం తెలిసిందే. ఈ కామెంట్స్‌పై కేటీఆర్ స్పందించారు. పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని.. కడియంతోపాటు అందరూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీ ఫిరాయించిన వారికి పరాభవం తప్పదని కేటీఆర్ విమర్శించారు.

# కులగణనపై ఎవరికీ అనుమానాలు వద్దు

**- కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుంది - చాకలి ఐలమ్మ జయంతి సభలో మంత్రి పొన్నం**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** కులగణనపై ఎలాంటి అనుమానాలు వద్దని, కాంగ్రెస్ పార్టీ ఎవరికీ అన్యాయం చేయదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం , వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అండగా ఉంటుందని, బీసీ కమిషన్ గడువు ముగిసిన వారం రోజుల్లోపే కొత్త కమిషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కులగణన పూర్తి చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఉద్యమాల నుంచి వచ్చిన బిడ్డగా తాను బీసీలకు అన్యాయం జరగనివ్వనని అన్నారు. కొందరు కోఠీ మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలన శవాల మీద పేలాలు ఏరుకున్నట్టుగా జరిగిందన్నారు. పదేండ్ల పాలన మేడి పండు చందంగా ఉందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే అందరూ ముందుకు సాగాలని, బంగారు తెలంగాణ సాధన దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది కానీ నిధులు ఇవ్వలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మన చరిత్ర బయటికి వచ్చిందని అన్నారు. తాను ఒక సారి ఐలమ్మను చూసినట్టు చెప్పారు. మహిళా వర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడమంటే మన ఆత్మగౌరవాన్ని గుర్తించడమని అన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. బీసీ కమిషన్ తరపున సమగ్రంగా కులాల సమాచారం సేకరించబోతున్నామని అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఐలమ్మ మనుమరాలు శ్వేత మాట్లాడుతూ.. వీరనారి ఐలమ్మది పోరాటాల చరిత్ర అన్నారు. దొరతనానికి ధిక్కార స్వరం వినిపించిన బడుగుల గొంతుక అని అభివర్ణించారు.

గత ప్రభుత్వం తమను ఆహ్వానించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమే గుర్తించిందని చెప్పారు. రజకులకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# అపవిత్రం చేసిన వారే తిరుమలకు వెళతారా

**- హిందువుల మనోభావాలు దెబ్బతీసి డ్రామాలా**
**- బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ఘాటు వ్యాఖ్యలు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారు తిరిగి అక్కడికి వెళ్లడం ఎందుకని జగన్ తిరుమల యాత్రపై బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూ పవిత్రత గురించి ఆయన మాట్లాడారు. వారు తిరుమల వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు. లడ్డూను అపవిత్రం చేసిన వారు తిరుమల వెళితే హిందువులు అంతా ఏకమై వారిని హతమారుస్తారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందువుల మనోభావాలు అందరూ గౌరవించాల్సిందే నని రాజా సింగ్ స్పష్టం చేశారు. ఇందులో సందేహానికి తావులేదని తేల్చి చెప్పారు. హిందువులను చులకన చేయడం, తప్పుగా మాట్లాడతారో వారికి ఇబ్బందులు తప్పవని తనదైన శైలిలో రాజా సింగ్ హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని రాజా సింగ్ సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లడ్డూ నాణ్యతపై ఏపీ సర్కార్ సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సిట్‌తోపాటు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని రాజా సింగ్ కోరారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆలయాలను పరిరక్షించాలని అభిప్రాయ పడ్డారు. అదేవిధంగా దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన భూములను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే అవి యథేచ్ఛగా ఆక్రమణకు గురి అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందు సంస్కృతి, సంప్రదాయాల ను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాల్లో అన్య మతస్తుల ప్రచారం గురించి రాజా సింగ్ గుర్తుచేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద అన్య మతస్తుల సంచారం ఆందోళన కలిగిస్తోందని వివరించారు. తిరుపతితోపాటు శ్రీశైలంలో అన్య మతస్తుల గురించి వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. మత మార్పిడి చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా చోట్ల అన్య మతస్తుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. డబ్బులు, ఇతరత్రా ఇస్తామని చెప్పి హిందువుల మత మార్పిడి చేస్తున్నారని వివరించారు. మతం మారిన వారిలో బలహీన వర్గాలే ఎక్కువ మంది ఉన్నారని గుర్తుచేశారు.

# చాకలి ఐలమ్మకు సీఎం ఘన నివాళి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమెకు రాష్ట్రం యావత్తూ ఘనంగా నివాళి అర్పించింది. పార్టీలకు అతీతంగా పలువురు ఆమెను స్మరించుకున్నారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆమె చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాటాన్ని స్మరించుకున్నారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588